చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.175	230	280
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.190	220	280

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 । కనిష్ఠం 22.0



తుర్కపల్లి మండలంలో నేలవాలిన వరి చేను

భారీ వర్షంతో అతలాకుతలం

» యాదాద్రి జిల్లాలో ఈదురుగాలులతో భారీ వర్షం
» అక్కడక్కడ వడగండ్లు » నేలవాలిన వరిచేలు
» మామిడి తోటల్లో రాలిన కాయలు
» విరిగిన విద్యుత్ స్తంభాలు

యాదాద్రి జిల్లాను అకాల వర్షం అతలాకుతలం చేసింది. గురువారం సాయంత్రం బలమైన ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీంతో పలు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరి చేలు నేలవాలాయి. మామిడితోటల్లో కాయలు రాలాయి. కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. చెట్లు కూలిపడటంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో రాత్రి వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రాజాపేట మండలం బేగంపేటలో పిడుగుపాటుకు రెండు పాడి గేదెలు మృతి చెందాయి. జిల్లాలో అత్యధికంగా, నారాయణపురం మండలంలో 9.78సెంటీమీటర్లు, తుర్కపల్లి మండలంలో 8.2సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మిగిలిన మండలాల్లో చిరుజల్లులు మొదలు మోస్తరు వర్షం కురిసింది.

•6లో.. - (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)



రాజాపేట మండలం నర్సాపూర్‌లో కురిసిన వడగండ్లు

తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

వైద్యులు ప్రభుత్వ సర్వీస్‌లో చేరి

ప్రజలకు సేవ చేయాలి

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవంలో విద్యార్థినికి పట్టాను అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ పూర్తిచేసుకుని వైద్య పట్టా పొందిన డాక్టర్లు ప్రభుత్వ సర్వీస్‌లో చేరి ప్రజలకు సేవ చేయాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య వృత్తిని పూర్తిచేసిన డాక్టర్లు ప్రభుత్వ సర్వీసులో చేరి పేద ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం పేదల వైద్య సంక్షేమం కోసం రాజీవ్ చేయూత, 108 అంబులెన్స్ వాహనాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఈనెల 5వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. కనగల్ పీహెచ్‌సీలో గ్లకోమా పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వ వైద్యుల కృషితో మాతా శిశుమరణాలు 30శాతం తగ్గాయని అన్నారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో లైఫ్ సేవింగ్ కార్యక్రమాల్లో భాగంగా ఫొటోథెరపీ, బేబీ వార్మింగ్ పరికరాల వంటివి ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వైద్య వృత్తి ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించవచ్చని అన్నారు. వైద్యవిద్యలో భాగంగా విదేశాల్లో పైచదువులు చదివినా తిరిగి నల్లగొండ ప్రాంతానికి వచ్చి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ సంచాలకుడు ఏ.నరేంద్రకుమార్, ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మా సంగతేంటి?

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవులపై ఉత్కంఠ కొనసాగుతోంది. క్యాబినెట్ విస్తరణ అనంతరం పెండింగ్‌లో ఉన్న అన్ని నామినేటెడ్ పోస్టులకు నియామకాలు చేపడతామని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రకటించినప్పటికీ, క్యాబినెట్ విస్తరణ రోజురోజుకూ జాప్యమవుతోంది. దీంతో నామినేటెడ్ పదవులు కోరుతున్న ఆశావహుల్లో ఆందోళన మొదలైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



నామినేటెడ్ పదవులపై ఉత్కంఠ »
క్యాబినెట్ విస్తరణ జాప్యంతో వీటిపై ప్రభావం »
ముఖ్యనేతలపై ఒత్తిడి తెస్తున్న ఆశావహులు »
నేతల వద్ద ముమ్మర ప్రయత్నాలు »

రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ ఏప్రిల్ మొదటివారంలోనే ఉంటుందని భావించినా, రకరకాల కారణాలతో అది వాయిదా పడింది. దీంతో క్యాబినెట్ విస్తరణతో సంబంధం లేకుండా నామినేటెడ్ పదవుల పంపకాలు చేపట్టాలని ఆశావహులు మంత్రులు, ముఖ్యనేతలపై ఒత్తి డి తెస్తున్నారు. పదేళ్లపాటు అధికారంలో లేకున్నా పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, గడచిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి చెమటోడ్చిన నాయకులతోపాటు, అధిష్ఠానం సూచనలమేరకు ఎమ్మెల్యే టిక్కెట్లకు పోటీ నుంచి తప్పుకున్న వారు ఇకనైనా తమకు ఇచ్చిన హామీ మేరకు తక్షణం నామినేటెడ్ పదవులు ఇవ్వాలని గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్నారు.

గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్న ఆశావహులు

క్యాబినెట్ విస్తరణ, తత్సమాన పదవుల నియామకాలు పూర్తయిన వెంటనే నామినేటెడ్ పదవులూ భర్తీ చేస్తామని అంతా భావిస్తున్న తరుణంలో విస్తరణ వాయిదా పడింది. దీంతో తమ సంగతేంటని, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నేతలు గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, డాక్టర్ కుడుదుల నగేశ్‌లు వారికి కీలకమైన పదవి వస్తుందనే విశ్వాసంలో ఉన్నారు. కీలకమైన యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, బోర్డు సభ్యుల పదవులతో పాటు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు, జిల్లా స్థాయిల్లో ఉండే గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, మహిళా ఆర్గనైజర్ పదవులు, దేవాలయాల కమిటీల చైర్మన్ పదవులు, అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీల చైర్మన్ పదవులు, మార్కెట్ కమిటీ చైర్మన్ల వంటి పదవులను ఆశించే నాయకులంతా పదవులిప్పించాలని మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. ● బీసీ కోటాలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత కార్పొరేషన్ పదవిని ఆశిస్తున్నారు. ● నల్లగొండ నియోజకవర్గంలో పార్టీని ముందుండి నడిపి, క్యాడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన గుమ్మల మోహన్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి పదవి వస్తుందని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహిరంగంగా ప్రకటించినా, ఇప్పటివరకు ఆయనకు పదవి ఖరారు కాలేదు. ● నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన ముఖ్య అనుచరుడు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డికి సైతం రాష్ట్ర కార్పొరేషన్లలో కీలక పదవి ఖాయమైందని చెబుతున్నా నియామకం జరగకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. ● నకిరేకల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిక్కెట్ ఆశించి భంగపడ్డ పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యకు త్వరలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖాయమని చెబుతున్నారు. మరోవైపు దైద రవీందర్, అన్నెపర్తి జ్ఞానసుందర్ కూడా కార్పొరేషన్ పదవులకోసం ప్రయత్నాలు చేస్తున్నారు. యాదాద్రి జిల్లా పార్టీ



మిగతా 7వ పేజీలో...

నామినేటెడ్‌లో ఛాన్స్ దక్కింది కొందరికే

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీ పదవులు దక్కాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందే తొలిదశలో జరిగిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లో ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేష్‌రెడ్డి (సూర్యాపేట), మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి (ఆలేరు), రాష్ట్ర దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య (హుజూర్‌నగర్) నియమితులయ్యారు. రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి నియమితులయ్యారు.

సీసీఎస్ బిల్లును ఉపసంహరించుకోవాలి

టాప్రా జిల్లా అధ్యక్షుడు జగదీష్ చంద్ర



పోస్టల్ అధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సీసీఎస్ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్‌చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పెన్షనర్ల జేఏసీ పోరాట కార్యక్రమంలో భాగంగా టాప్రా ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోస్టల్ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెన్షన్ భిక్ష కాదని అది హక్కు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ రూల్స్‌కు అతి ప్రమాదకరమైన సీసీఎస్ బిల్లును ప్రవేశపెట్టి లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదింపచేయడం విచారకరమన్నారు.

ఈ బిల్లు ద్వారా 50లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65లక్షల మంది పెన్షనర్లకు నష్టమన్నారు. వీరితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర రంగాల్లోని ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇది ఉరితాడు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా పెన్షన్లను ఉద్యోగ విరమణ తేదీ ఆధారంగా నిర్ణయించడానికి కేంద్రం తెచ్చిన బిల్లు అధికారం కల్పిస్తోందన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణాల పరిపూర్ణాచారి మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా సర్వీస్ చేసిన ఓ ప్రభుత్వరంగ కార్మికుడికి రూ.3వేల పెన్షన్ కూడా రావడం లేదని, కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టాప్రా జిల్లా గౌరవ అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, నాయకులు ఎండి.అబ్దుల్‌ఖాదర్, గుండాల భిక్షమయ్య, చంద్రారెడ్డి, రామచంద్రం, జయ రామయ్య, నరసింహ, ప్రసాద్, కేసాని భిక్షంరెడ్డి, సిలువేరు మారయ్య, జి.భిక్షమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సన్నాలను సాగుచేయాలి

» కలెక్టర్ ఇలా త్రిపాఠి » త్వరలో నిత్యావసర సరుకుల పంపిణీ : ఎమ్మెల్యే బాలునాయక్



లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్, ఏఎస్పీ మౌనిక

డిండి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైతులు సన్న ధాన్యం సాగుకు ముందుకు రావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. గురువారం డిండి మండల కేంద్రంలోని రేషన్ దుకాణం-2 వద్ద ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు సన్నాలను సాగుచేసి ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.మండలంలో 10ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. రేషన్‌కార్డుల కోసం మండలంలో 1,426 మంది దరఖాస్తు చేసుకున్నారని, పారదర్శకంగా విచారణ నిర్వహించి కొత్తకార్డులు జారీ చేస్తామన్నారు. దేవరకొండలో వేబ్రిడ్జి ఏర్పాటు చేస్తామన్నారు.

రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు

రేషన్ దుకాణాల ద్వారా త్వరలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలపై ఆర్థిక భారం తగ్గించి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా జారీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం 30లక్షల నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పిస్తోందన్నారు. శాశ్వత సాగునీటి కోసం డిండి ఎత్తిపోతలకు రూ.1,800 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచిందని, మూడేళ్లలో పనులు పూర్తిచేసి సాగునీరు అందిస్తామన్నారు. డిండిలో అంగడి బజార్‌లో రూ.3.70కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని, బీసీ కాలనీలో సీసీరోడ్లు పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. పూరిగుడిసెలు, రేకుల ఇళ్లు ఉన్నవారికి ఇందిరమ్మ ఇంటి పథకంలో తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంపీడీవో వెంకన్న, డీఎస్‌వో హరీష్, డీటీసీఎస్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, ఎన్.రాజేష్‌రెడ్డి, గుర్రం రాములు, గోవర్ధన్‌రావు, యాదగిరిరావు, బుచ్చిరెడ్డి, పోలం లక్ష్మణ్, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, గడ్డమీది సాయి, బూషిపాక వెంకటయ్య, నూకం వెంకటేష్, మేకల కాశయ్య, ఎండి.మైనుద్దీన్, పోల వెంకటేష్, గంగిడి ఆనంద్‌రెడ్డి, పేట కొండల్, మహమ్మద్ అలీ, సాలయ్య, బద్య, పోషాలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తోందని తెలిపారు. రైతులు ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏవో శివరాంకుమార్, ఏఈవోలు శిరీష, వేణుగోపాల్, పార్వతీ, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూలులో చండూరుకు ప్రథమ స్థానం

చండూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఆర్థిక సంవత్సరానికి (2024-25) ఇంటి పన్ను వసూళ్లలో చండూరు మునిసిపాలిటీ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది.చండూరు మునిసిపాలిటీలో 3,635 ఆస్తులు ఉన్నాయి. 2024-25 సంవత్సరానికి ఆస్తి పన్ను డిమాండ్ రూ.67లక్షలు కాగా, మార్చి 31 నాటికి రూ.57లక్షలు వసూలైంది. జిల్లాలో చండూరు 85.07శాతం వసూలుతో ప్రథమ స్థానంలో నిలవగా, దేవరకొండ మునిసిపాలిటీ 74.30శాతంతో రెండో స్థానంలో, చిట్యాల మునిసిపాలిటీ 73.18శాతంతో మూడో స్థానంలో నిలిచాయి. చండూరు ప్రథమ స్థానంలో నిలవడంతో గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి మునిసిపల్ కమిషనర్ మున్వర్ అలీకి అప్రిసియేషన్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మునిసిపల్ కమిషనర్ మున్వర్ అలీ మాట్లాడుతూ, ప్రజలు చెల్లించే ఇంటి పన్ను పట్టణ అభివృద్ధికి తోడ్పడుతుందని ఇంటింటికీ తిరిగి సిబ్బంది అవగాహన కల్పించారన్నారు. పన్ను బకాయిల వడ్డీపై ప్రభుత్వం 90శాతం రాయితీ కల్పించడంతో బకాయిదారులు సద్వినియోగం చేసుకునేలా కృషి చేశామన్నారు.



మునిసిపల్ కమిషనర్ మున్వర్ అలీ

ఉమ్మడి జిల్లాలో ఆస్తి పన్ను వసూలు వివరాలు 7లో..

'డిండి'కి పూడిక ముప్పు

డిండి రిజర్వాయర్‌ను పూడిక దెబ్బతీస్తోంది. నీటి నిల్వ సామర్థ్యం ఏడాదికేడాదికి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఈ విషయాన్ని సీడబ్ల్యూసీ బృందం సర్వేలో నిర్ధారణ కాగా ప్రతి ఏటా 5.39 శాతం నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నట్లు వెల్లడైంది. ప్రాజెక్టు ప్రారంభించిన తొలినాళ్లలో రెండు పంటలకు నీటిని విడుదల చేయగా ఆ తర్వాత దశాబ్దాల పాటు వరద నీరు లేక రిజర్వాయర్ నిండిందీ లేదు. సాగుకు నీరందిందీ లేదు. అయితే ఆరేళ్ల నుంచి ఎగువన కల్వకుర్తి ప్రాజెక్టు నుంచి సీపేజీ నీరు వచ్చిచేరుతుండటంతో ఒక్కపంటకు సాగు నీరు సమృద్ధిగా అందుతుండగా, 25 ఏళ్లలో రెండు పర్యాయాలు మాత్రం రెండు పంటలకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 22 అడుగుల మేర నీరున్నప్పటికీ 10 అడుగుల మేర పూడిక ఉండటం గమనార్హం.

- (ఆంధ్రజ్యోతి-డిండి)



- ▸▸ తగ్గుతున్న రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం
- ▸▸ 10 అడుగుల మేర పూడిక

నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో డిండి రిజర్వాయర్ ఒకటి. ప్రస్తుతం నీటి మట్టం క్రమంగా తగ్గిపోతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 36 అడుగులు(2.4 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 22(ఒక టీఎంసీ) అడుగులకు చేరింది. ఎగువన కురిసిన భారీ వర్షాలకు 2024 ఆగస్టు చివరివారంలో రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ఠ మట్టానికి చేరుకుంది. ఆయకట్టులో వానాకాలం సీజన్‌లో పంటల సాగుకు సెప్టెంబరు మొదటివారంలో నీటిని విడుదల చేశారు. పంటలు పూర్తయ్యే వరకూ ఎగువ నుంచి నీరు వస్తుండడంతో ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అవుతూ వచ్చింది. వానాకాలం సాగుచేసిన వరికోతలు పూర్తయ్యాక యాసంగి వరిసాగుకు ప్రాజెక్టులో నీటిని తీసుకోవాలని 2024న డిసెంబరు 1న తీర్మాణించారు. ఆ మేరకు రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకునేందుకు మాత్రమే నీటిని విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు సూచించినప్పటికీ అందుకు భిన్నంగా రైతులు వరి సాగుకే మొగ్గుచూపారు. 2024 డిసెంబరు 11న యాసంగి సాగుకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఎడమకాలువ పరిధిలో 12,500 ఎకరాలతో పాటు కుడికాలువ పరిధిలోని 300 ఎకరాలలో రైతులు సాగుచేశారు. యాసంగి నీటిని విడుదల చేసే సమయంలో రిజర్వాయర్ అలుగుపోస్తునే ఉంది. దిగువకు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా విడుదలవుతున్న 230 క్యూసెక్కులకు అంతేమేర ఎగువ నుంచి ప్రాజెక్టుకు నీరు వచ్చి చేరుతుండడంతో గరిష్ఠ నీటిమట్టం 36 అడుగల వద్ద నెల రోజుల పాటు కొనసాగింది. ఎగువ నుంచి ప్రతి రోజూ నీరు వచ్చి చేరుతుండటంతో సుమారు నెల రోజుల నీరు మిగిలాయి. ఇదిలా ఉండగా యాసంగి సీజన్‌లో సాగుచేసిన 12,500 ఎకరాలకు ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు(ఒక టీఎంసీ) సరిపోతుందని అధికారులు అంచనాకు వచ్చారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సుమారు 30 రోజుల్లో ప్రస్తుతం ఉన్న 22 అడుగుల నీటితో పంటలు చేతికొస్తాయని అధికారులు తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

2.61 టీఎంసీల నుంచి 2.4 టీఎంసీలకు...

డిండి రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరదతో పాటు షీల్ట్(మట్టి ఇసుక) వచ్చి చేరడంతో ప్రతి ఏడాది 5.39 శాతం నీటినిల్వ సామర్థ్యాన్ని కోల్పోతోంది. 1943 ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నీటినిల్వ సామర్థ్యం 2.61 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2022న నిర్వహించిన సీడబ్ల్యూసీ సర్వే ప్రకారం 2.4 టీఎంసీలకు తగ్గింది. ప్రతి ఏడాది 0.02 టీఎంసీ మేర నీటినిల్వసామర్థ్యాన్ని ప్రాజెక్టు కోల్పోతూ వస్తోందని సీడబ్ల్యూసి నివేదిక సమర్పించింది.

ప్రాజెక్టులో 10 అడుగుల మేర..

అప్పటి నిజాం ప్రభుత్వం 1940లో డిండి ప్రాజెక్టు పనులు ప్రారంభించగా 1943 జూలైలో పనులు పూర్తయ్యాయి. వర్షాధార ప్రాజెక్టైన డిండి ప్రాజెక్టు గత 80 ఏళ్లలో ఎగువ నుంచి వరద ప్రవాహంతో పాటు ఇసుక, బురద ప్రాజెక్టులోకి కొట్టుకురావడం వల్ల 10 అడుగులమేర పూడిక మేటవేసింది. ప్రారంభంలో రెండు సీజన్లకు సాగునీటిని అందించిన ప్రాజెక్టు క్రమేణ ఒక సీజన్‌కు కూడా నీరు అందించే సామర్థ్యాన్ని పూడిక వల్ల కోల్పోయింది. 1996లో నాబార్డు నిధులు రూ.6.31 కోట్లు ఖర్చు చేసి స్పిల్‌వేను మూ డు అడుగుల మేర ఎత్తు పెంచారు. అయిన ప్పటికీ ఒక్కసా రి ప్రాజెక్టు ఓవర్ ఫ్లో అయినా కూడా సాగుచేసిన వరిపైర్లకు నెల రోజుల నీరు తక్కువ పడుతు వచ్చాయి. ప్రాజెక్టులో నీటిని చూసి సాగుచేసిన రైతులు అనేకసార్లు పంటలు ఎండిపోయిన సందర్భాలూ ఉన్నాయి.

పిల్ల కాల్వల్లో పూడికను తొలగించుకోవాలి



రైతులు తమ పొలాలకు వచ్చే పిల్లకాల్వలోని బురద(పూడిక), గడ్డిని తొలగించుకోవాలి. కాల్వల్లో నీరు సాఫీగా పారేలా జాగ్రత్తలు తీసుకోవాలి. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవడం వల్ల పంటలకు నీరు తక్కువ పడదు.

- కొసిరెడ్డి రాజేందర్‌రెడ్డి, రైతు, గోనకోలు

పొదుపుగా వినియోగించాలి

రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి. పిల్ల కాల్వలకు మరమ్మతులు చేసుకొని యాసంగిలో సాగుచేసిన పంటలు గట్టెక్కేలా అధికారులకు సహకరించాలి. వాగుల్లో, వంపుల్లో నీరు వృథాగా పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- శ్రీనివాస్, డీఈ

25 ఏళ్లలో రెండుసార్లు

డిండి ప్రాజెక్టు కట్టిన మొదట్లో రెండు పంటలకు నీరందేది. క్రమేణా ఎగువ నుంచి నీటి రాక లేకపోవడంతో మూడు, నాలుగేళ్లకు రిజర్వాయర్ నిండుతుండేది. అయితే 2000 సంవత్సరం తర్వాత నేటి వరకు పాతికేళ్లలో 2021-22లో, 2024-25లో మాత్రమే రెండు పంటలకు నీటిని విడుదల చేశారు. దీంతో వానాకాలం, యాసంగి సీజన్లలో ఆయకట్టులోని 12,500 ఎకరాలు సాగులోకి వచ్చాయి. ఆరేళ్లుగా కల్వకుర్తి ఎత్తిపోతల సీఫేజ్ నీరు వచ్చి చేరుతుండటంతో డిండి ప్రాజెక్టులో నీటి కళ సంతరించుకుంది. నీటి లభ్యత పెరగడంతో పాటు సాగు విస్తీర్ణం పెరిగి ఆయకట్టు రైతులు కొంతమేర ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. రిజర్వాయర్‌పై ఆధారపడిన 400 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి.



ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు లభ్యం



విద్యార్థులు గల్లంతైన క్రషర్ క్వారీ, మృతులు శ్యాంచరణ్, జతిన్(ఫైల్‌ఫొటోలు)

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సరదాగా స్టోన్ క్రషర్ క్వారీలోని గుంతలో ఈత కోసం వెళ్లి గల్లంతైన ఇద్దరు బీటెక్ విద్యార్థులు మృత్యువాత పడ్డారు. బుధవారం రాత్రి వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. సంఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామశివారులోని సాయి వికాస్ స్టోన్ క్రషర్ క్వారీలో ఈతకొట్టేందుకు స్థానిక ఓ యూనివర్సిటీలో బీటెక్ సీఎస్ఈ ఫస్ట్‌ఇయర్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులు వెళ్లారు. అందులో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన గంద జతిన్(18), బొడ్డు శ్యాంచరణ్(18) ఈత రాదు. మిగతా చల్లా అక్షయ్‌రెడ్డి, వర్షల శ్రీమాన్, అన్నెపర్తి భరత్‌లు ఈతవచ్చు. జతిన్, శ్యాంచరణ్‌లు నీటిలో మునిగి ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో మిగిలిన ముగ్గురిలో ఓ విద్యార్థి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మిగతా ఇద్దరు కలిసి నీటిలో ఎంతవెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆ ఇద్దరూ క్వారీ నుంచి బయటకువచ్చి హైదరాబాద్ వెళ్లిపోయారు. సహవిద్యార్థులకు సమాచారమివ్వటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గుంతలో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రంతా జరిపిన గాలింపులో ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు లభ్యమైనట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతుల కుటుంబాలకు మృతదేహాలను అప్పగించామని ఆయన తెలిపారు. సాయి వికాస్ స్టోన్ క్రషర్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు మృతి చెందారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్వారీ నిర్వాహకులు సెక్యూరిటీని బలోపేతం చేయాలని, విద్యార్థులు ఇతరులు అక్కడికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైనింగ్ అధికారులు తరుచూ క్రషర్లను తనిఖీ చేయాలని, జాగ్రత్తలను సూచించాలని కోరారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి బలవన్మరణం



భారతి(ఫైల్‌ఫొటో)

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన కర్ర భారతి దివీస్ పరిశ్రమలో పనిచేస్తోంది. ఉదయం విధులకు వెళ్లిన భారతి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత భర్త వాసుదేవరావుతో గొడవ పడింది. దీంతో మనస్తాపానికి గురైన భారతి ఇంట్లో ఉరివేసుకుంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మెకానిక్..

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లిలో గురువారం జరిగింది. ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆకవరం ఉపేందర్(47) మెకానిక్ పని చేస్తూ భార్యాపిల్లలతో కలిసి అక్కెనపల్లిలోనే ఉంటున్నాడు. కాగా పనులు దొరకక కొన్నినెలలుగా తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతమయ్యాడు. దీంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించే సమయానికి మృతి చెందాడు. ఉపేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి, భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పనిలభించడం లేదని వలస కార్మికుడు..

భువనగిరి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పని లభించడం లేదని పశ్చిమబెంగాల్ రాష్ట్రం కొల్‌కత్తాకు చెందిన కార్మికుడు యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్‌కత్తా చెందిన వలస కార్మికుడు ఎండీ షాబుద్దీన్(35) ఉపాధి నిమిత్తం మూడు నెలల కిందట భువనగిరికి వచ్చాడు. స్థానిక కూలీల అడ్డా జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద కూలి పనుల కోసం వెళ్తున్నాడు. కొద్దిరోజులుగా కూలీ పని లభించకపోతుండడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి అద్దెకు ఉంటున్న గదిలో ఉరివేసుకున్నాడు. పనుల నుంచి ఆలస్యంగా తిరిగి వచ్చిన సహచర కార్మికులకు షాబుద్దీన్ విగతజీవిగా కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం చేరవేయడంతో సంఘటనా స్థలానికి చేరకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. షాబుద్దీన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఐపీఎల్ బెట్టింగ్

ఇద్దరు అరెస్ట్... తొమ్మిది మంది పరారీ

తుర్కపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ఆన్‌లైన్‌లో ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్‌ఐ ఖాజా లతీఫ్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం పల్లెపహాడ్, గొల్లగూడెం కేంద్రంగా 15 రోజులుగా ఐపీఎల్ బెట్టింగ్ వ్యవహారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో ఎస్‌వోటీ పోలీసులు ఆయా గ్రామాల్లో నిఘా ఉంచారు. బుధవారం రాత్రి గుజరాత్ - బెంగళూరు జట్టు ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా పల్లెపహాడ్, గొల్లగూడెం కేంద్రంగా దేశ పాండ్య భానుప్రసాద్, రాముల మహేష్ బుకీలుగా వ్యవహరిస్తూ మరో తొమ్మిది మందితో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. రాత్రి బెట్టింగ్‌కు పాల్పడుతుండగా ఎస్‌వోటీ పోలీసులు పక్కా సమాచారంతో భానుప్రసాద్, మహేష్‌లను అదుపులోకి తీసుకొని తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముల్కలపల్లి పల్లెపహడ్, గొల్లగూడెం, పెద్ద తండా పంచాయతీ పరిధిలోని సూక్యా తండాకు చెందిన సురేష్ నాగరాజు వినోద్ నాయక్, గనీ రాములు వెంకటేశం, మహేష్, భాషా, శ్రీకాంత్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బెట్టింగ్‌కు పాల్పడ్డ వ్యక్తుల నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.50వేల నగదును స్వాధీనం చేసుకుని 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఖాజా లతీఫ్ గురువారం తెలిపారు.

మండుటెండలో మహావర్షం

యాదాద్రిభువనగిరి జిల్లాను గురువారం ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలు కుదిపేశాయి. ఉదయం వరకు ఉక్కపోతు, వేడిమితో ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో పాటు భారీ ఈదురుగాలులు, వడగండ్ల వర్షం కురిసింది. సంస్థాన్‌నారాయణపురం, తుర్కపల్లి మండలాల్లో భారీగా వర్షపాతం నమోదైంది. పిడుగుపాటుకు జీవాలు మృత్యువాత పడగా, వడగండ్ల కు కంకులు నేలకొరిగి ధాన్యం రాలిపోయింది.





చౌటుప్పల్‌లోని ఓ వీధిలో నిలిచిన వర్షపు నీరు, భువనగిరిలో కురుస్తున్నవర్షం

యాదాద్రి జిల్లాలో...	
మండలం	వర్షపాతం
నారాయణపురం	97.8
తుర్కపల్లి	82.5
చౌటుప్పల్	50.5
బీబీనగర్	48.5
ఆత్మకూరు(ఎం)	44.5
గుండాల	37.3

(వర్షపాతం మిల్లీమీటర్లలో)

తుర్కపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండలంలో గురువారం మధ్యాహ్నం మండలకేంద్రంతో పాటు పలుగ్రామాల్లో భారీ ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీంతో వరి, మామిడి తోటలు దెబ్బతిన రైతులకు భారీ నష్టం వాటిల్లింది. తుర్కపల్లిలోని భువనగిరి-గజ్వేల్ రహదారికి ఇరువైపులా ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న రేకులు ఈదురుగాలులకు ఎగిరిపోయాయి. చెట్లు కూలి కార్లు, వాహనాల మీద పడడంతో దెబ్బతిన్నాయి. భువనగిరి-గజ్వేల్ రహదారిలో వాసాలమర్రి సమీపంలో భారీ ఈదురుగాలులతో వేపచెట్టు కూలీ అడ్డంగా పడటంతో అరగంటకు పైగా వాహనాల రాకపోకలు నిలిచాయి. ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. చేతికందిన వరి పంట నేలకు ఒరగడంతో పాటు వడగండ్లకు కంకులు రాలిపోయాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో యాజమానులకు భారీగా నష్టం వాటిల్లింది. వాసాలమర్రిలో చెన్నబోయిన ఆంజనేయులు ఇంట్లోకి వర్షపు నీరు చేరడంతో సామగ్రి తడిసి ముద్దయ్యింది.



పోచంపల్లిలో రహదారిపై నిలిచిన నీరు

రాజపేట: రాజాపేట మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షం కురిసింది. నర్సాపూర్‌లో 10నిమిషాల పాటు కచ్చకాయల సైజులో వడగండ్లు పడ్డాయి. 20 రోజుల్లో చేతికి వచ్చే కంకి దశలో ఉన్న వరి పంట దెబ్బతింది. కొంతమేర రాలిపోయింది. అధికారులు పంటనష్టం అంచనా వేసి ఆర్థికసహాయాన్ని అందించాలని రైతులు అంజిరెడ్డి, ఉప్పలయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు కోరారు.

రామన్నపేట: మండలంలో వర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న వరి చేనుల్లో ధాన్యం రాలిపోయింది. పలుచోట్ల మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకు నీళ్లు అందక కొంత పంట ఎండిపోగా, ప్రస్తుతం వర్షానికి పంట దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లిలో సాయంత్రం భారీవర్షం కురిసిన వర్షానికి పలుచోట్ల రహదారులపై నీరునిలిచింది.మూసీ పసరివాహక ప్రాంతం కావడంతో అన్నిగ్రామాల్లో ధాన్యం కోతలకు చేరువైంది. చేతికందే సమయాన అకాల వర్షాలతో పంట దెబ్బతిని అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

వలిగొండ : వలిగొండ మండలంలో గురువారం సాయంత్రం ముసురు కురిసింది. ఉదయం ఉక్కపోతగా ఉండి సాయంత్రానికి ఈదురుగాలులు ఉరుములు మెరుపులతో చిరుజల్లులు కురిసింది. ఈదురుగాలులతో విద్యుత్‌కి అంతరాయం కలిగింది.

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ పట్టణంలో గురువారం సాయంత్రం దాదాపు రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఉక్కపోగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వరి పొలాలకు ఈ వర్షం కొంత జీవం పోసిందని రైతులు తెలిపారు.

మోత్కూరు/ ఆత్మకూరు(ఎం): మోత్కూరు మండలంలో గురువారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. రేవతి కార్తె కావడంతో వడగళ్లు కురుస్తాయేమోనని రైతులు ఆందోళన చెందారు. తేలిక పాటి వర్షం కురియడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం రాశులపై రైతులు టార్పాలిన్లు కప్పి ధాన్యం తడువకుండా కాపాడుకున్నారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మోస్తరు వర్షం పడింది.

భువనగిరి టౌన్ : భువనగిరిలో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన వర్షంతో ప్రజలకు వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. సాయంత్రానికి నుంచి రాత్రి పొద్దుపోయే వరకు తేలికపాటి జల్లులు కురిశాయి. రాకపోకలు, చిరు వ్యాపారులకు ఇబ్బందిగా మారింది.

రెండు గంటల్లో 9.78 సెంటీమీటర్ల వర్షపాతం

సంస్థాన్ నారాయణపురం : సంస్థాన్‌నారాయణపురం మండలంలో రెండు గంటల్లో 9.78 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. సాయంత్ర నాలుగున్నర నుంచి ఆరున్నర గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఇన్నాళ్ల వర్షాల్లే భూగర్భజలాలు అడుగంటి అటు తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో భారీ వర్షం అటు రైతుల్లో, ప్రజల్లో ఆనందం నింపింది. శేరిగూడెం గ్రామంలో కుంటకట్టలోకి, నారాయణపురంలోని మేళ్లచెరువు కుంటలోకి వరద చేరుతోంది. ఇన్నాళ్లు నీళ్లలేక ఎండిన చెరువులు, కుంటలు నీటికళ సంతరించుకున్నాయి. అకాల వర్షానికి నారాయణపురంలో చెట్లు విరిగిపడ్డాయి. మండలకేంద్రానికి చెందిన జక్కిడి వెంకట్‌రెడ్డికి చెందిన ఎకరం టమాట తోట వర్షానికి దెబ్బతింది. గడ్డం నరసింహకు చెందిన ఇల్లు దెబ్బతింది. కొంతమేర వరి పంటకు నష్టం వాటిల్లింది.

నాలుగున్నర గంటల్లో 8.25 సెంటీమీటర్ల వర్షపాతం

తుర్కపల్లి: మండలంలో గురువారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి వడగండ్ల వర్షం మొదలైంది. 50నిమిషాల పాటు ఎడతెరిపి లేని భారీ వర్షం కురువగా సాయంత్రం వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. సాయంత్రం 7 గంటల వరకు 8.25 సెంటీమీటర్ల వర్షం పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఏడు గంటల తర్వాత విద్యుత్ పునరుద్ధరణ

మండలకేంద్రంతో పాటు దత్తాయపల్లి, ఎంజీబండ, డీబీ తండా, కోనాపురం, ముల్కలపల్లి, తదితర గ్రామాల్లో 20 విద్యుత్‌స్తంభాలు కూలి సరఫరా నిలిచింది. మధ్యాహ్నం 2.30 గంటలకు సరఫరాకు ఆటంకం కలగగా జిల్లా ఎస్‌ఈ సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో కమర్షియల్ ఏడీ రవీందర్‌నాయక్, ట్రాన్స్‌కో ఏఈ భిక్షపతిగౌడ్‌ల ఆధ్వర్యంలో విద్యుత్‌సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తస్తంభాలను, విద్యుత్‌వైర్లను ఏర్పాటుచేయించారు. రాత్రి తొమ్మిదిన్నర గంటలకు విద్యుత్ సరఫరాను అన్నిగ్రామాల్లో పునరుద్ధరించారు. ఇందుకోసం అన్నిస్థాయిల్లోని విద్యుత్ అధికారుల బృందం ఏడున్నర గంటలు శ్రమించింది.

● పిడుగుపాటుకు జీవాలు మృతి

రాజాపేట: భారీవర్షాలకు తోడు పలుచోట్ల పిడుగులు పడ్డాయి. పాముకుంట, బేగంపేట గ్రామాల్లో పిడుగు పడి షేక్ మౌలానాకు చెందిన పాడిగేదె, గడ్డమీది ఉప్పలయ్యకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. సుమారు రూ.2.50లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.


● సింగారం గ్రామంలో విద్యుదాఘాతంతో మూడు మేకలు మృతి చెందాయి. రూ.40 వేల నష్టం వాటిల్లింది. షేక్ షాద్‌ల్లా, కృష్ణ, మహ్మద్‌లకు చెందిన మూడు మేకలు సెల్ టవర్ వద్ద మేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మేకలు మృతి చెందాయి.



రాజాపేట మండలం బేగంపేటలో మృతి చెందిన పాడి ఆవు

15 రోజుల కిందటే కొనుగోలు

వలిగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వలిగొండ మండలంలో గురువారం సాయంత్రం పిడుగుపడి గేదె మృతి చెందింది. టేకులసోమారం గ్రామానికి చెందిన రైతు పాక రాంచందర్ తన పొలం వద్ద పాడిగేదెను కొట్టంలో కట్టేశాడు. పిడుగుపాటుకు గురై గేదె మృతి చెందింది. గేదెను 15రోజుల క్రితమే రైతు కొనుగోలు చేశాడు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.







మోత్కూరు మార్కెట్‌లో ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు, తుర్కపల్లి ఎస్సీ కాలనీలో కూలిన విద్యుత్ స్తంభం



తుర్కపల్లిలో చర్చి సమీపంలో కారుపై కూలిన వేపచెట్టు



నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం నాలుగు గంటల నుంచి వాతావరణం చల్లబడటంతో ఆర్జాలబావి ఐకేపీ కేంద్రంలో రైతులు ముందస్తుగా ధాన్యం రాశులపై పట్టా కప్పి జాగ్రత్త పడ్డారు.

సాగర్‌లో భారీ వర్షం

ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం

నాగార్జునసాగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గత మూడు నెలలుగా ఎండల తీవ్రత ఎక్కువ ఉండటంతో ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయిన సాగర్ ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.



మిర్యాలగూడలో ఈదురుగాలులు వీస్తుండటంతో ధాన్యాన్ని తరలిస్తున్న ట్రాక్టర్‌పై టార్పాలిన్ కప్పుతున్న రైతులు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైడూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,35,894 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

వాహన పూజలకు చోటేదీ..!



ఆలయ ఉత్తర దిక్కులో వాహన పూజల కుటీరం, హెలిప్యాడ్ ఒకే చోట ఉన్న

- వాహన పూజలు, హెలిప్యాడ్ స్థలం ఒకే చోట
- చాపర్ వస్తే రద్దవుతున్న పూజలు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వాహన పూజ చేయించుకుంటే అంతా శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. అయితే వాహన పూజలు చేసే స్థలం..హెలిప్యాడ్ స్థలం ఒకేచోట ఉండడంతో వాహనపూజకు వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాపర్‌లో వీఐపీలు క్షేత్ర పర్యటనకు వచ్చిన ప్రతిసారి వాహన పూజలు రద్దు చేస్తున్నారు. రూ.1,200 కోట్లతో నిర్మించిన లక్ష్మీనృసింహుడి ఆలయం చెంత వాహన పూజలు జరుపుకు నేం దుకు ప్రత్యేకంగా ఒక భవనం అందు బాటులో లేదు. నిరంతరం వాహన పూజలు కొనసా గేందుకు నిర్దిష్టమైన స్థలం ఇప్పటి వరకు కేటాయించలేదు. అందుకు తగిన ఏర్పాట్లపై దృష్టి సారించలేక స్థల మార్పుతో సరి పెడు తున్నారు. కొండకింద వ్రత మండపం పక్కన కంటెయినర్‌లో నిర్వ హించేవారు. గత డిసెంబరులో క్షేత్రానికి ఉత్తర దిక్కులోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం 1008హోమకుండాలు ఏర్పా టు చేసేందుకు (రైతుల నుంచి సేకరించిన వ్యవసాయ భూమి) కేటాయించిన స్థలంలోనే అప్పట్లో ఏర్పరచిన ఏకైక కుటీరం ఖాళీగా ఉండడంతో స్వల్ప మరమ్మతులు చేసి అందులోనే వాహన పూజలు నిర్వహిస్తున్నారు. అంతకు ముందే పక్కనే హెలిప్యాడ్ ఏర్పాటు చేయగా ఈ రెండింటిని ఒకేచోట ఏర్పాటు చేయడంతో చాపర్‌లో వీఐపీలు వచ్చిన ప్రతిసారి వాహన పూజలు రద్దు చేయడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అనువైన చోట వాహన పూజలు జరిపేందుకు చర్యలు తీసుకుంటాం



భక్తులకు కావాల్సిన వసతులు కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతు న్నాం. హెలిప్యాడ్, వాహ న పూజలు జరిగే స్థలం అతి సమీపంలో ఉన్నందున పూజలు జరిపేందుకు ఆటంకం కలుగుతోంది. అనువైన స్థలాన్ని గుర్తించి ఆ చోట నిరంతరంగా పూజలు జరిగేందుకు చర్యలు తీసుకుంటాం. వైటీడీఏ, ఆర్ అండ్‌బీ అధికారుల సంప్రదించి వారి సూచనలు మేరకు వేరే చోట కొత్తభవనాన్ని భక్తులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం.

- ఈవో ఏపూరి భాస్కర్‌రావు (యాదగిరిగుట్ట, దేవస్థానం)

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	517.80
టీఎంసీలు	145.2986
ఎడమకాల్వకు నీటి విడుదల	5,297
కుడికాల్వకు	3,031
విద్యుత్ కేంద్రం ద్వారా	4,032
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	3,598
అవుట్‌ఫ్లో	20,311

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.75 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	600 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్నిగేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	625.67 అడుగులు
టీఎంసీలు	0.90
కాల్వలకు విడుదల	469.44 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	500.10 క్యూసెక్కులు

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మాధవి లత

బీబీనగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : మహిళలు చట్టాలపై అవగాహన పెంచు కోవాల్సిన అవసరం ఉందని న్యాయసేవా అధికార సంస్థ జిల్లా కార్యదర్శి మాధవి లత అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలల హక్కులు, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం, బాల్య వివాహాల నిర్మూలన చట్టం , గృహహింస, బాలింతలకు ఇచ్చే పరిహారం చట్టాలు మొదలగు వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బాలిక సంరక్షణ సమితి అధ్యక్షులు జయశ్రీ మైనర్ బాలికల పరిరక్షణ, సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన హక్కులపై అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ప్రకాశ్ రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యురాలు రుద్రమదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత పాల్గొన్నారు.

సన్న ధాన్యానికి రైతులు బోనస్ పొందాలి

● డీఆర్‌డీఓ పీడీ శేఖర్‌రెడ్డి



కనగల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి

కనగల్, ఏప్రిల్ 3:(ఆంధ్రజ్యోతి): సన్న ధాన్యానికి రైతులు రూ.500బోనస్‌ను పొందాలని డీఆర్‌డీఓ ఎర్రబెల్లి శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కనగల్, పర్వతగిరి, దోరెపల్లి, శాబ్దులాపురం, పగిడిమర్రి, పొనుగోడు, రాంచంద్రాపురం, కురంపల్లి, మదనాపురం, బుడుమర్లపల్లి, ఎంగొరారం, అమ్మగూడెం, తుర్కపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కల్లాల్లో ఆరబెట్టి, మట్టిపెళ్లలు లేకుండా శుభ్రపర్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలన్నారు. ఏగ్రేడ్ వరి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి క్వింటాకు రూ.2,300 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ప్రతీ బస్తా 40.7 కేజీల చొప్పున తూకం వేయాలని హమాలీలకు సూచించారు. సీరియల్ పాటించి, పారదర్శకంగా కొనుగోలు చేపట్టాలన్నారు. కనగల్ ఎక్స్‌రోడ్డులో ఏర్పాటు చేసిన సన్నధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు సన్న ధాన్యాన్ని తీసుకుని వచ్చి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ పొందాలన్నారు. మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం సన్నబియ్యం పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో రైతులు సన్న రకం వరి సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. తహసీల్దార్ పద్మ, ఏవో అమరేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి, నర్సింగ్ క్రిష్ణయ్య గౌడ్, మురళిగౌడ్, ఏపీఎం నరహరి, సీసీలు ప్రభాకర్, వసంత, విజయ, సీఆర్‌టీ జానకి, కోయగూర అంజిరెడ్డి, ఎర్రమాద వెంకట్‌రెడ్డి, హఫీజుద్దీన్ ఎర్రమాదవెంకట్‌రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

బార్ ఏర్పాటుకు దరఖాస్తులకు నోటిఫికేషన్ జారీ

నల్లగొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ మునిసిపాలిటీలో రద్దయిన బార్ స్థానంలో దరఖాస్తుల కోసం గురువారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సంతోష్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా చేసుకోవాలని తెలిపారు. అప్లికేషన్ ఫారంతో పాటు లక్ష రూపాయల విలువైన చలానా, డీడీ, మూడు కలర్ పాస్ ఫొ టోలు, ఆధార్‌కార్డు లేదా పాన్‌కార్డును జత చేయాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులకు 29వ తేదీన ఉదయం 11 గంటలకు కలెక్టర్ లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటాచలపతి



చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ బార్ అసోసియేషన్ (న్యాయవాదులు) అధ్యక్షుడిగా ప్రముఖ న్యా యవాది బాల్యం వెంకటా చలపతి 14 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో గురువారం ఎన్నికలను నిర్వహించారు. మొత్తం 37ఓట్లకు గాను 36 పోలయ్యాయి. ఇందులో వెంకటాచలపతికి 25 ఓట్లు , ప్రత్యర్థి వాకిటి నరసింహారెడ్డి 11 ఓట్లు లభించాయి. ఉపాధ్యక్షుడిగా రాపోలు వేణుకు మార్ (ఏకగ్రీవం), ప్రధాన కార్యదర్శిగా పడమటి మహిపాల్ రెడ్డి (11 ఓట్ల మెజార్టీ), సంయుక్త కార్యదర్శిగా అల్లి స్వాతి (14ఓట్ల మెజార్టీ), కోశాధికారిగా జల్లా రమేష్ (ఏకగ్రీవం), లైబ్రరీ కార్యదర్శిగా జక్కర్తి శేఖర్ (22 ఓట్ల మెజార్టీ), క్రీడల కార్యదర్శిగా దేశబోయిన శ్రీశైలం (16 ఓట్ల మెజార్టీ), మహిళా ప్రతినిధి నకిరేకంటి జ్యోతి (ఏకగ్రీవం), కార్యవర్గ సభ్యులుగా ఎండీ.ఖయ్యూమ్‌పాషా (14 ఓట్ల మెజార్టీ) , పి.కిరణ్ (7 ఓట్ల మెజార్టీ) విజయం సాధించారు. ఈ ఎన్నికను ఎన్నికల అధికారి కె.వెంకటయ్య ప్రకటించారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



చింతపల్లి సాయిసన్నిధిలో వైద్యశిబిరంలో పాల్గొన్న డైరెక్టర్ రవి నాయక్, తదితరులు

చింతపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను శాశ్వతంగా దూరం చేయవచ్చని ఆయుర్వేద రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రవినాయక్ తెలిపారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ఆవరణంలో గురువారం ఆయుర్వేద విభాగం ఆధ్వర్యంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధులను కూడా ఆయుర్వేద మందులు వాడటంతో పూర్తి చేయవవచ్చన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి వూరె కృష్ణయ్య, గోశాల ఇన్‌చార్జి కుంభం పుల్లారెడ్డి, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లాఠీచార్జిపై సీఎం క్షమాపణ చెప్పాలి

● బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి



నల్లగొండలో నిరసన తెలుపుతున్న బీజేవైఎం శ్రేణులు

నల్లగొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో విశ్వవిద్యాలయం భూములను కాపాడటానికి ప్రయత్నిస్తున్న అమాయకులైన విద్యార్థులపై లాఠీచార్జి చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించి తక్షణమే క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ సమయంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగిస్తూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేసే ప్రక్రియను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న నాయకులను అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, దిండు భాస్కర్‌గౌడ్, దుబ్బాక సాయికిరణ్, గుండెబోయిన శాంతిస్వరూప్, మిర్యాల వెంకన్న పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

బీబీనగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య పోరాట పటిమ ఎందరికో స్ఫూర్తినిచ్చిందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం బీబీనగర్ మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య 98వ జయంతి వేడుకల సందర్భంగా కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురయ్య విగ్రహావిష్కరణకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య నాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూస్వాముల అరాచకాలపై కొనసాగించిన పోరాటాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, పింగల్ రెడ్డి, పి.శ్యాంగౌడ్, బాల్‌రెడ్డి, బాలరాజు యాదవ్, శ్రీశైలం, అశోక్, సత్యనారాయణ, అయిలయ్య, గోపాల్, ముత్యాలు పాల్గొన్నారు.



బీబీనగర్‌లో దొడ్డికొమరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉమ్మడి జిల్లాలో ఆస్తిపన్ను వసూలు ఇలా..

జిల్లా	మునిసిపాలిటీ	ఆస్తులు	పన్ను డిమాండ్	వసూలు (రూ.కోట్లలో)	శాతం
నల్లగొండ	చండూరు	3635	0.67	0.57	85.07
	దేవరకొండ	7066	2.84	2.11	74.30
	చిట్యాల	3671	1.79	1.31	73.18
	హాలియా	5625	2.05	1.4	68.29
	మిర్యాలగూడ	25723	20.92	10.98	52.49
	నల్లగొండ	42111	47.33	17.38	36.72
	నకిరేకల్	9036	7.06	2.26	32.01
సూర్యాపేట	నేరేడుచర్ల	3961	1.14	0.92	80.70
	హుజూర్‌నగర్	8431	2.48	1.90	76.61
	కోదాడ	17189	7.76	5.60	72.16
	సూర్యాపేట	35479	16.65	11.97	71.89
	తిరుమలగిరి	5484	1.40	0.94	67.14
యాదాద్రి	మోత్కూరు	4949	1.26	0.98	77.78
	చౌటుప్పల్	8626	7.35	5.27	71.70
	యాదగిరిగుట్ట	5009	3.27	2.22	67.89
	ఆలేరు	4785	2.26	1.41	62.39
	భువనగిరి	15095	9.90	6.09	61.52
	పోచంపల్లి	5028	2.11	1.23	58.29

చెట్టు జిగురుతో జారిపడిన వాహనదారులు

● రోడ్డును బంద్ చేసిన స్థానికులు



మిర్యాలగూడలో మూసివేసిన రహదారి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో చెట్టు నుంచి జిగురు లాంటి పదార్థం కింద పడటంతో బైక్‌లు స్కిడ్ అయి ప్రమాదాలు జరిగిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మునిసిపల్ ఆఫీసు వైపునకు వచ్చే రహదారి ఓ భారీ వృక్షం నుంచి రోజూ సన్నని తుంపర్లు పడుతున్నాయి. అయితే గురువారం సాయంత్రం నుంచి జల్లులతో కూడిన వర్షం పడటంతో సదరు చెట్టు నుంచి నల్లటి పదార్థం కింద పడి రోడ్డంతా జిగురుగా మారింది. ఇది తెలియని ఓ ద్విచక్రవాహనదారుడు అక్కడకు రాగానే స్కిడ్ అయి కిందపడటంతో స్థానికులు పరేషాన్ అయ్యారు. ఇలా వెంటవెంటనే ద్విచక్ర వాహనదారుతు అదే ప్రదేశంలో కిందపడి గాయపడ్డారు. దీంతో స్థానికులు అప్రమత్తమై రహదారికి ఇరువైపులా బారికేడ్లు, రాళ్లు అడ్డుపెట్టారు. విషయాన్ని సమీపంలోని మునిసిపల్ కేంద్రంలో అధికారులకు తెలియజేశామని, మునిసిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసినా స్పందించలేదని స్థానికులు తెలిపారు.

మా సంగతేంటి?

(5వపేజీ తరువాయి)

అధ్యక్షుడిగా కొనసాగుతున్న అండెం సంజీవరెడ్డి, ఉమ్మడి రాష్ట్రంలో ఐడీసీ సంస్థ డైరెక్టర్లుగా పనిచేసిన సాముల శివారెడ్డి (హుజూర్‌నగర్), కంచర్ల యాదగిరిరెడ్డి (తుంగతుర్తి) కూడా కార్పొరేషన్ పదవులొస్తాయనే నమ్మకంలో ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌గా పనిచేసిన ఎరగాని నాగన్న, పీసీసీ సభ్యుడు దొంగరి వెంకటేశ్వర్లు కూడా కార్పొరేషన్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కోదాడ నియోజకవర్గం నుంచి సీనియర్‌నేతలు ముత్తవరపు పాండురంగారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి సైతం పరిస్థితులు అనుకూలిస్తే కీలకపదవులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. యాదాద్రి జిల్లా నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శి పొత్నక్ ప్రమోద్‌కుమార్, పంజాల రామాంజనేయులుగౌడ్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, లింగంయాదవ్ కూడా కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జూలూరి ధనలక్ష్మి మహిళా కోటాలో తనకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. మొత్తానికి ఎవరికి ఏ పదవి దక్కుతుందో వేచి చూడాల్సిందే.

రెండు కిలోల గంజాయి పట్టివేత

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గంజాయిని బస్సులో తరలిస్తున్న ఓ వ్యక్తిని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన 26ఏళ్ల ఉతుప్పల్ మండల్ శ్రీకాకుళం నుంచి హైదరాబాద్‌కు బస్సులో ప్రయాణిస్తూ సంచిలో రెండు కిలోల గంజాయిని తీసుకువెళుతున్నాడు. పోలీసులు చౌటుప్పల్ బస్‌స్టేషన్ ఎదుట వాహనాలను గురువారం తనిఖీ చేస్తూ నిందితుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేషన్ దుకాణాల్లో రద్దీ



చౌటుప్పల్‌లోని రేషన్ దుకాణంలో వేలి ముద్ర వేస్తున్న మహిళ

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నందున రద్దీ నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని రేషన్ దుకాణాల నుంచి తెల్లరేషన్ కార్డుదారులు సన్న బియ్యాన్ని ఆనందంగా తీసుకువెళుతున్నారు. దీంతో మూడు రోజుల నుంచి దుకాణాల ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. మునిసిపాలిటీతో కలిపి రూరల్ మండలంలో 43 రేషన్ దుకాణాలు ఉండగా, వాటి పరిధిలో 19,171 తెల్ల కార్డులు ఉన్నాయి. ఈ దుకాణాల ద్వారా 4075 క్వింటాళ్ల బియ్యాన్ని పేద కుటుంబాలకు అందజేస్తున్నారు. మునిసిపాలిటీలో 7,377 కార్డుల ద్వారా 1565 క్వింటాళ్లు, రూరల్‌లో 11,794 కార్డుల ద్వారా 2510 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేయాల్సి ఉంది.

సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతిస్తున్నాం

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్‌తో కలిసి మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరగుతున్న విధ్వంసాన్ని, చెట్లను నరకడాన్ని ఆపాలని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని సుప్రీంకోర్టు చాలా సీరియస్‌గా హెచ్చరించి స్టే విధించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 400 ఎకరాలను కార్పొరేట్ శక్తులకు విక్రయించే యత్నాన్ని ఇకనైనా మానుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ, నియంతృత్వ చర్యలను ఆపాలని, అదే విధంగా విదార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 400 ఎకరాల భూమిని యునివర్సిటీకి కేటాయించాలన్నారు. విద్యార్థుల పోరాటాల ఫలితంగానే సుప్రీంకోర్టు స్టే విధించిందని, ఈ భూముల కోసం పోరాడిన విద్యార్థులకు, ప్రజా సంఘాలకు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేపు బాబుజగ్జీవన్‌రాం జయంతి

నల్లగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం 118వ జయంతి ఉత్సవాలను ఈ నెల 5వ తేదీన ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

గోపలాయపల్లి గుట్టపై సుదర్శన హోమం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంపై గురువారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం రోహిణిని పురస్కరించుకుని ప్రతీ నెలా సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ హోమ క్రతువులో పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

రవీందర్, ఎస్‌ఐ, కట్టంగూరు



ఇంటర్వ్యూ Interview

జాతీయరహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. హైవేపై ప్రమాదకరంగా ఉన్న బ్లాక్‌స్పాట్‌లను గుర్తించాం. ప్రమాదాలను నివారించేందుకు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామని కట్టంగూరు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. (కట్టంగూరు, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: 65వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌ఐ: జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు వాహనాదారులకు డ్రంకెన్ డ్రైవ్ కేసులు వేస్తున్నాం. ప్రమాదకరమైన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: జాతీయ రహదారిపై ఎన్ని బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు? ఎక్కడెక్కడ ఉన్నాయి?

ఎస్‌ఐ: మండలంలో 65వ జాతీయ రహదారి సుమారు 19 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ పరిధిలో నాలుగు బ్లాక్ స్పాట్‌లను గుర్తించాం. ముత్యాలమ్మగూడెం పరిధిలోని మాణిక్యాలమ్మగూడెం జంక్షన్, కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డు, అయిటిపాముల సమీపంలో చెర్వుఅన్నారం క్రాస్‌రోడ్డు, పామనగుండ్ల జంక్షన్ గుర్తించాం.

ఆంధ్రజ్యోతి: ప్రమాదాలపై వాహనాదారులకు, ప్రజలకు ఏమైనా అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్‌ఐ: ఎస్పీ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణకు మార్చి 27 కట్టంగూరులో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో లారీ, డీసీఎం, ఆటో, ద్విచక్ర వాహనదారులతో పాటు స్థానికులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశాం.

ఆంధ్రజ్యోతి: ప్రమాదకరమైన జంక్షన్ల వద్ద పోలీస్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేస్తారా?

ఎస్‌ఐ: కట్టంగూరులోని ఈదులూరు క్రాస్ రోడ్డు నుంచి నల్లగొండకు వెళ్లే వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్లకుండా ఈదులూరు క్రాస్ రోడ్డు వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు ఎన్ని డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు?

ఎస్‌ఐ: ఈ సంవత్సరంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి ఇప్పటి వరకు మూడు నెలల్లో 156 డ్రంకెన్ డ్రైవ్ కేసులను నమోదు చేశాం. జనవరిలో 48, ఫిబ్రవరిలో 39, మార్చి 69 కేసు లు నమోదు చేశాం.

ఆంధ్రజ్యోతి: ప్రమాదకరంగా ఉన్న కట్టంగూరులో ఉన్న క్రాస్‌రోడ్డుపై ఎలాంటి దృష్టి పెడుతున్నారు?

ఎస్‌ఐ: కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉంది. ఇటీవల ఎస్పీ ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడి ఈ జంక్షన్‌ను విస్తరించాలని సూచించారు. దీంతో పాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చేందుకు ప్రజల కోసం సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఈ జంక్షన్ వద్ద ప్రమాదాలను నివారించేందుకు జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని తగ్గించేందుకు జీబ్రా లైన్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

6 నెలల్లో ఐదుగురు కార్యదర్శులు

- అమ్మో..ఎల్లారెడ్డిగూడెం పంచాయతా..!
- అక్కడ పనిచేయలేమంటున్న కార్యదర్శులు
- జీపీ ప్రత్యేకాధికారిని మార్చాలని డిమాండ్

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పేరు చెబితేనే పంచాయతీ కార్యదర్శులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామ పంచాయతీ మా కొద్దు బాబు... మేం అక్కడ పనిచేయలేమంటున్నారు. గత 6 నెలల వ్యవధిలోనే ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు మారారంటేనే అక్కడ పనిచేయడానికి కార్యదర్శులు ఎంతగా విముఖత చూపుతున్నారో అర్థమవుతోంది. గ్రామ పంచాయతీ పాలనా వ్యవహారాల్లో మితిమీరిన రాజకీయ జోక్యం... సమస్యలపై నిత్యం ప్రశ్నించే జనం... గత పంచాయతీ పాలకవర్గ పాలన అస్తవ్యస్తం... వెరసి గ్రామ పంచాయతీని చుట్టుముట్టిన రాజకీయ, ఆర్థిక వివాదాల నేపథ్యంలో ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ అధికారుల ఒత్తిడితో వచ్చినా కొన్నాళ్ల పాటే ఉంటున్నారు.

వేలం వివాదాలకు కారణం

గ్రామ పంచాయతీకి సింహభాగం ఆదాయాన్ని సమకూర్చే కొబ్బరికాయల విక్రయ వేలమే ఇక్కడ ప్రధానంగా రచ్చకు దారితీసింది. గ్రామ సమీపంలో జిల్లాలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఉంది. భక్తులు ఈ క్షేత్రానికి ఎల్లారెడ్డిగూడెం నుంచే వెళ్లాల్సి ఉంది. ఈ అవకాశాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఏడాది కాలపరిమితి కింద కొబ్బరికాయల విక్రయ వేలం హక్కును బహిరంగ వేలం నిర్వహించి ఇస్తున్నారు. అయితే కొబ్బరికాయల విక్రయ వేలం హక్కు ను పొందిన వేలందారులు వేలం డబ్బుల్లో కొంత మొత్తాన్ని చెల్లించకుండా రాజకీయ పరపతి ని ఉపయోగిస్తున్నారు. అప్పుడు మీరు... ఇపుడు మే ము...అన్నట్లుగా గ్రామ పంచాయతీ కొబ్బరి కాయల విక్రయ వేలం హక్కు డబ్బులు పూర్తిగా చెల్లించకపో వడం వివాదాలకు కారణమవుతోంది. ఇప్పటి వరకు సుమారు రూ.30లక్షలకు పైగా వేలం బకాయిలు కాంట్రాక్టర్ల నుంచి రావాల్సి ఉన్నట్లు సమాచారం.



ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ భవనం

నలిగిపోతున్న కార్యదర్శులు

ఇదిలా ఉంటే వేలం డబ్బుల బకాయి వసూళ్లతో పాటు కొన్ని పాలనా పరమైన నిర్ణయాల్లో పంచాయతీ కార్యదర్శులు నలిగిపోతున్నారు. కరవమంటే కప్పకు కోపం... విడవమంటే పాముకు కోపం... అనే చందంగా పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి నెలకొంది. బకాయిల వసూళ్ల విషయంలోనే కార్యదర్శులు రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. పైగా గ్రామంలో ప్రతీ సమస్యను పెద్దదిగా చేసి సోషల్ మీడియా వేదికగా కొందరు నిలదీస్తున్న తీరుతో పాటు సమస్యను పరిష్కరించే అవకాశం లేకపోవడంతో కార్యదర్శులు ఇక్కడ పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో రెండు నెలలకొకరు చొప్పున ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు.

ప్రత్యేకాధికారి ఉన్నా...

ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు ఉన్నారు. కానీ ప్రభుత్వ ప్రాధాన్యాలకు భూ సేకరణ, ప్రతీ రోజూ భూముల రిజిస్ట్రేషన్, ఇతర ప్రొటోకాల్ విధుల కారణంగా గ్రామ పంచాయతీ పాలనా వ్యవహారాలపై ఆయన ఎక్కువగా సమయం ఇవ్వలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మరో మండల స్థాయి అధికారిని జీపీ ప్రత్యేకాధికారిగా నియమించాలనే సూచన గ్రామస్థుల నుంచి వినిపిస్తుంది.

అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి

- సింగిల్‌విండో చైర్మన్ నర్సిరెడ్డి

నాంపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సింగిల్‌విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రైతు సహకార సంఘం కార్యాలయంలో ధాన్యం కొనుగోలు, కొనుగోలు కేంద్రాలపై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులు కల్లాల వద్దని ధాన్యం ఆరబెట్టుకుని నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని సూచించారు. సమావేశంలో ఏవో శివకుమార్, వైస్‌చైర్మన్ సత్తయ్య, సంఘం సీఈవో నితీష్, పాలకవర్గ సభ్యులు ఆదిరెడ్డి సతీష్, థౌర్య, వెంకటరెడ్డి రాంబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



కేతేపల్లి : భీమారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేం ద్రాల్లోనే విక్రయించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పీఏసీఎస్, డీసీఎంఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం నాణ్యతగా ఉండేలా చూడాలని, దళారీలకు ధాన్యం అమ్మి మోసపోవద్దని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏవో బి.పురుషోత్తం, మార్కెట్ డైరెక్టర్లు, ఎస్‌కె.లతీఫ్, బయ్య ముత్తయ్య, సైదులు, పీఏసీఎస్ సీఈవో వడ్డె నర్సయ్య, ఐకేపీ ఏపీఎం యాదమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, కాంగ్రెస్ నాయకులు గుత్తా మాధవరెడ్డి, బి.సుందర్, బడుగుల నరేందర్, సీటీ.ప్రసాద్, ప్రవీణ్, రమేష్, పుల్లయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిరేకల్: రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. నకిరేకల్ మండలంలోని పలు గ్రామాల్లో 7ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నకిరేకల్ మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ జమీరుద్దీన్, ఎంపీడీవో చంద్రశేఖర్, మార్కెట్ డైరెక్టర్ నకిరేకంటి నరేందర్, మాజీ ఎంపీటీసీ వీరార్జున్‌రెడ్డి, సీఈవో జగన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని శాలిగౌరారం సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి అన్నారు. మండలంలోని తిరుమలరాయినిగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో సౌమ్యశృతి కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈవో నిమ్మల ఆంజనేయులు, నాయకులు కడారి అంజయ్య, బ్యాంకు సిబ్బంది కర్నాటి శంకర్, హమాలీ సంఘం నాయకులు బండారు శేఖర్, గుండ్ల యాదయ్య, రాములు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారాముల బ్రహ్మోత్సవాలు



శాలిగౌరారంలోని సీతారామ చంద్రస్వామి ఆలయం

శాలిగౌరారం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేలాది భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శాలిగౌరారం సీతారామచంద్రస్వామి కల్యాణానికి సిద్ధమయ్యారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మండల కేంద్రమైన శాలిగౌరారంలో సీతారామచంద్రస్వామి ఆలయం అంగరంగా వైభవంగా ముస్తాబైంది. గతేడాది శ్రీరామనవమి సందర్భంగా పది రోజలు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారామకల్యాణోత్సవానికి మూడు రోజులు పాటు అధ్యయన ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. అందులో భాగంగా 4న శుక్రవారం ప్రథమ పదోత్సవం, 6న కల్యాణం, 10వ తేదీన దేపోత్సవం(జాతర), 11న ఏకాంత సేవలు జరగనున్నాయి. శ్రీరామనవమి రోజున చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు సుమారు దాదాపు 20 గ్రామాలకు చెందిన భక్తులు తండోపతండాలు తరలివచ్చి సీతారామ కల్యాణాన్ని చూసి పరవశించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు వరుసగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. సీతారామచంద్రస్వామి దేవాలయంలో రామునికి మీసాలు ఉంటాయి. మిగతా దేవాలయాలు రాముడికి మీసాలు ఉండవు. అందుకే మీసాల రాముడిగా పూజిస్తారు. సీతారామ కల్యాణం ఎక్కడైనా మధ్యాహ్నం నిర్వహించే సంప్రదాయం ఉండగా శాలిగౌరారం దేవాలయంలో కల్యాణాన్ని రాత్రి సమయంలో నిర్వహిస్తారు. వంశపారంపర ధర్మకర్తలు శేషం రత్నమాచార్యులు యాజీవకులుగా వ్యవహరిస్తున్నారు. శేషం న ర్సింహ్మాచార్యులు, శేషం రామచంద్రాచార్యులు, శేషం జగన్మోచార్యులు తదితర ధర్మకర్తులు అధ్యాపకులుగా, పారాయణ కర్తలుగా, అర్చకులుగా వ్యవహరిస్తున్నారు.

గ్రూప్స్ ఫలితాల్లో కిరణ్‌రెడ్డికి రాష్ట్రస్థాయిలో 49వ ర్యాంకు



సాయి కిరణ్‌రెడ్డి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు గ్రామానికి చెంది న రేగట్టె వెంకట్ గోపాల్‌రెడ్డి, రజిత ల కుమారుడైన సాయి కిరణ్‌రెడ్డి గ్రూప్-1 ఫలితాల్లో 501.500 మార్కులతో రాష్ట్ర స్థాయి 49వ ర్యాంకు, జోన్‌స్థాయిలో 21వ ర్యాంకు సాధించి డీఎస్పీ పోస్టుకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్స్‌ను సాధించడమే తన లక్ష్యమని సాయి కిరణ్‌రెడ్డి పే ర్కొన్నారు. ఓ వైపు సివిల్స్‌కు సన్నద్ధమవుతూనే గ్రూప్స్ ప రీక్షలు రాసినట్లు తెలిపారు. 2024లో ఉద్యోగ నియామక పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రస్తుతం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో కేంద్ర వాణిజ్య పన్ను, జీఎస్‌టీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు.

సీసీ కెమెరాలతో ఆకతాయి చేష్టల నియంత్రణ



చెర్వుగట్టు పాఠశాలలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న మల్లిఖార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆకతాయిల చేష్టలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి అన్నారు. చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ సుమారు రూ.30 వేల నిధులతో గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బహూకరించిన సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆకతాయిలు కొందరు పాఠశాల మూసి ఉన్న సమయంలో గోడదూకి వచ్చి తరగతి గదుల్లోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. పాఠశాల హెచ్‌ఎం విజ్ఞప్తి మేరకు తన సొంత ఖర్చుతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన మల్ల బాలకృష్ణను రేగట్టె అభినందించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి సహకరించాలి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని పురాతన రామాలయ పునర్నిర్మాణానికి గ్రామస్థులు, భక్తులు, దాతలు సహకరించాలని మండలంలోని నెమ్మాని గ్రామ పురోహితుడు గుండేపూడి జానకిరామశర్మ విజ్ఞప్తి చేశారు. రామాలయ పునర్నిర్మాణంపై గురువారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో ప్రాచుర్యం పొందిన నెమ్మాని రామాలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కేమ పరమేశం, ఆలయ అర్చకుడు తిరునగర్ రామ్మూర్తి, ఉత్తరాపల్లి నర్సింహాచార్యులు, బానాల వెంకట్‌రెడ్డి, మిర్యాల రంగయ్య, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, నర్సింహ, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

ఆటో పల్టీ: ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు

కేతేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పనులు పూర్తి చేసుకుని ఇంటికి తిరుగుముఖం పట్టిన కూలీలు ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదం కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇరువురు బీహార్ కార్మికులు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫ్యాబ్రికేషన్స్‌కు చెందిన ఆరుగురు బీహార్ కార్మికులు కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఓ రేకుల షెడ్ వేసేందుకు కొద్ది రోజులుగా ఆటోలో వచ్చి వెళ్తున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం వరకు షెడ్డు పనుల్లో నిమగ్నమైన ఆరుగురు కార్మికులు పనులు ముగించుకుని తాము వచ్చిన ఆటోలోనే సూర్యాపేటకు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో స్థానిక రాములవారి గుడి వద్దకు రాగానే అదుపు తప్పిన ఆటో రోడ్డు పక్కకు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురు కార్మికుల్లో సురేష్, ఆదిత్యలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సర్వీసు సిబ్బంది క్షతగాత్రులను సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ



ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠలో పాల్గొన్న గ్రామస్థులు

చిట్యాలరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రా మంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం వైభవంగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్వజస్తంభానికి మొదటగా పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి హాజరైన ఉమ్మడి జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి ధ్వజస్తంభ ఏర్పాటుకు తనవంతుగా రూ.1.50లక్షల విరాళాన్ని అందజేశారు. ఆయన్ను ఆలయ చైర్మన్ బండ లింగస్వామి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాగర్ నీటి పైపు లీకేజీకి మరమ్మతులు

శాలిగౌరారం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఉట్కూరు గ్రామంలోని సాగర్ నీటి ప్రధాన పైపులైన్‌కు సిబ్బంది మరమ్మతులు చేశారు. ఉట్కూరులో సాగర్ నీటిపైపు లీకేజీ అనే వార్త ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు గురువారం సిబ్బందికి అక్కడికి చేరుకొని కలుషిత నీటిని, పగిలిన పైపులైన్‌ను తొలగించారు. నూతన పైపును అమర్చి గుంతను పూడ్చి నీటిని పునరుద్ధరించారు.

'రేషన్ దుకాణాల ఎదుట మోదీ ఫొటో పెట్టాలి'

మర్రిగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ దుకాణాల్లో ప్రధాని మోదీ ఫొటో పెట్టాలని బీజేపీ నాయకులు పిట్టల శ్రీనివాస్, యాస అమరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన సన్నబియ్యం కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఎజెండాగా మార్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే రేషన్‌ను కేంద్రప్రభుత్వం ఉచితంగా బియ్యం సరఫరా చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాస అశోక్‌రెడ్డి, పందుల రాములు, లింగయ్య, గ్యార యాదగిరి, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల సభ్యత్వనమోదు

చిట్యాలరూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీపీఎం అనుబంధ సంఘాలు ప్రజాసంఘాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం మండలంలోని ఉరుమడ్లలో ప్రారంభించారు. స్థానికులకు ప్రజాసంఘాల సభ్యత్వాలను సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ అందజేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టే ఆందోళన, పోరాటాలకు అన్నివర్గాల వారు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు మల్లయ్య, లక్ష్మి, యాదయ్య పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సేవలు మరువలేనివి



పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అంతటి నర్సింహ

చిట్యాలరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం వెలిమినేడులో బుధవారం రాత్రి కౌండిన్య యువజన సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాపన్నగౌడ్ విగ్రహానికి పలువురు గౌడసంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అంతటి నర్సింహగౌడ్, నాతి వెంకట్రామయ్యగౌడ్, అంతటి నాతి శ్రీనుగౌడ్, అంతటి సత్తయ్యగౌడ్, అంతటి శ్రీనివాస్, నాతి శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌గౌడ్, స్వామిగౌడ్, నరేష్, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'భూముల వేలాన్ని ఆపకుండా అక్రమ అరెస్టులా'

చిట్యాలరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వేలాన్ని ఆపకుండా ప్రభుత్వం విద్యార్థి సంఘం నాయకులను అక్రమ అరెస్టులు చేయడం ఏమిటని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్ల మహేష్ ప్రశ్నించారు. మండలంలోని వెలిమినేడులో గురువారం డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను చిట్యాల పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ హెచ్‌సీయూకి చెందిన వందలాది ఎకరాలను భూముల వేలాన్ని ఆపాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరితే తమను అక్రమంగా ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అరెస్టయిన వారిలో డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి పంది నరేష్, ఎస్‌ఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షుడు సాయికిరణ్ ఉన్నారు.

పేదల సంక్షేమం కోసమే సన్నబియ్యం



వట్టిమర్తిలో సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ వినోదమోహన్‌రెడ్డి

కనగల్, చిట్యాలరూరల్, నకిరేకల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసమే సన్నబియ్యం పథకాన్ని ప్రభుత్వం అమలుచేస్తుందని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. కనగల్ మండల కేంద్రంలోని రేషన్‌షాపులో గురువారం సన్నబియ్యం పథకాన్ని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ కలిసి ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు బియ్యం సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి, శీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ధనవంతుల మాదిరిగానే పేదలు కూడా సన్నబియ్యం అన్నం తినాలన్న ఆలోచనతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. అనంతరం మండలంలోని పగిడిమర్రి, తేలకంటిగూడెం, పొనుగోడు తదితర గ్రామాల్లో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ పద్మ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి, నాయకులు నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, పెద్దులు, హాఫీజుద్దీన్, కరీం ముల్లా, మురళిగౌడ్, యాదయ్య, జానయ్యగౌడ్ పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాలరూరల్: రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి, బొంగోనిచెర్వులోని రేషన్‌దుకాణాల్లో సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కాటం వెంకటేశం, సామిడి మోహన్‌రెడ్డి, అంతటి వెంకటేష్‌గౌడ్, గుడిపాటి లక్ష్మీనర్సింహ, కందాటి మహేందర్‌రెడ్డి, సామిడి సాయికృష్ణ, కట్ట ఆశయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నరేష్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, శ్రీను, నర్సింహ, సత్తయ్య, మహేష్, రమేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

- నకిరేకల్ పట్టణ పరిధిలోని రేషన్‌షాపుల వద్ద సన్నబియ్యం పంపిణీని మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పేదలకు వరంలాంటిదని అన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ జమీరుద్దీన్, కౌన్సిలర్లు గాజుల సుకన్య శ్రీనివాస్, గర్శకోటి సైదులు, రాచకొండ సునీల్, నాయకులు రాఘవరెడ్డి, కృష్ణమూర్తి, వెంకన్న, వీరూ, వెంకన్న పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూరు, శాలిగౌరారం, నాంపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కట్టంగూరు, శాలిగౌరారం, నాంపల్లి ఎస్‌ఐలు రవీందర్, డి.సైదులు, శోభన్‌బాబు కోరారు. ఆయా మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లలో వారు జాబ్‌మేళాను పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆధ్వర్యంలో ఈనెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువకులు పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 4వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లు నమోదు చేసుకున్నవారు 5వ తేదీన ఉదయం పోలీస్‌స్టేషన్ నుంచి జిల్లా కేంద్రానికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జాబ్‌మేళాలో 100 కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న విచారణ


నాంపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలంలోని గానుగుపెల్లి గ్రామంలో నకిలీ మద్యం తయారీపై విచారణ కొనసాగుతోంది. బుధవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి నకిలీ మద్యం తయారీని గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. తయారీదారుడు రమేష్‌పై 34ఏ, 37ఏ ఎక్సైజ్ చట్టం 58 ప్రకారం కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు గురువారం తెలిపారు. అదేవిధంగా మద్యం తయారీకి ఉపయోగించే స్పిరిట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మద్యం తయారీ వెనక ఎవరెవరున్నారు కోణంలో ఉన్నట్లు విచారిస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా ఎన్ని రోజులుగా తయారు చేస్తున్నారు. ఎవరెవరు సహకరిస్తున్నారు, ముడిసరుకులు ఎక్కడి నుంచి తెస్తున్నారని ఆరా తీస్తున్నారు. తయారైన మద్యాన్ని ఎక్కడెక్కడ విక్రయించారన్న దానిపై లోతుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే మండలానికి చెందిన ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మర్రిగూడ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరామదాసు శ్రీనివాస్ అన్నారు. గురువారం అజలాపురం గ్రామంలో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క శ్రీనివాస్, మేతరి యాదయ్య, అజీజ్‌రెడ్డి, మల్లేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉట్కూరు గ్రామ పంచాయతీకి బీరువా వితరణ

శాలిగౌరారం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉట్కూరు గ్రామపంచాయతీ కార్యాలయానికి గ్రామానికి చెందిన దేవనబోయిన బలరాములు జ్ఞాపకార్థం వారి కుమారులు దేవనబోయిన సైదులు, జానయ్య కలిసి రూ.10 వేలు విలువైన బీరువాను ఎంపీడీవో జ్యోతి లక్ష్మి సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, కృష్ణ, నాయకులు లింగయ్య పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.175	230	280
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.190	220	280

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 । కనిష్ఠం 22.0



తుర్కపల్లి మండలంలో నేలవాలిన వరి చేను

భారీ వర్షంతో అతలాకుతలం

- యాదాద్రి జిల్లాలో ఈదురుగాలులతో భారీ వర్షం
- అక్కడక్కడ వడగండ్లు
- నేలవాలిన వరిచేలు
- మామిడి తోటల్లో రాలిన కాయలు
- విరిగిన విద్యుత్ స్తంభాలు

యాదాద్రి జిల్లాను అకాల వర్షం అతలాకుతలం చేసింది. గురువారం సాయంత్రం బలమైన ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీంతో పలు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరి చేలు నేలవాలాయి. మామిడితోటల్లో కాయలు రాలాయి. కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. చెట్లు కూలిపడటంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో రాత్రి వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రాజాపేట మండలం బేగంపేటలో పిడుగుపాటుకు రెండు పాడి గేదెలు మృతి చెందాయి. జిల్లాలో అత్యధికంగా, నారాయణపురం మండలంలో 9.78సెంటీమీటర్లు, తుర్కపల్లి మండలంలో 8.2సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మిగిలిన మండలాల్లో చిరుజల్లులు మొదలు మోస్తరు వర్షం కురిసింది.

●6లో.. - (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)



రాజాపేట మండలం నర్సాపూర్‌లో కురిసిన వడగండ్లు

తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

వైద్యులు ప్రభుత్వ సర్వీస్‌లో చేరి

ప్రజలకు సేవ చేయాలి


రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవంలో విద్యార్థినికి పట్టాను అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ పూర్తిచేసుకుని వైద్య పట్టా పొందిన డాక్టర్లు ప్రభుత్వ సర్వీస్‌లో చేరి ప్రజలకు సేవ చేయాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య వృత్తిని పూర్తిచేసిన డాక్టర్లు ప్రభుత్వ సర్వీసులో చేరి పేద ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం పేదల వైద్య సంక్షేమం కోసం రాజీవ్ చేయూత, 108 అంబులెన్స్ వాహనాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఈనెల 5వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. కనగల్ పీహెచ్‌సీలో గ్లకోమా పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వ వైద్యుల కృషితో మాతా శిశుమరణాలు 30శాతం తగ్గాయని అన్నారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో లైఫ్ సేవింగ్ కార్యక్రమాల్లో భాగంగా ఫొటోథెరపీ, బేబీ వార్మింగ్ పరికరాల వంటివి ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వైద్య వృత్తి ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించవచ్చని అన్నారు. వైద్యవిద్యలో భాగంగా విదేశాల్లో పైచదువులు చదివినా తిరిగి నల్లగొండ ప్రాంతానికి వచ్చి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ సంచాలకుడు ఏ.నరేంద్రకుమార్, ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మా సంగతేంటి?



- నామినేటెడ్ పదవులపై ఉత్కంఠ
- క్యాబినెట్ విస్తరణ జాప్యంతో వీటిపై ప్రభావం
- ముఖ్యనేతలపై ఒత్తిడి తెస్తున్న ఆశావహులు
- నేతల వద్ద ముమ్మర ప్రయత్నాలు

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవులపై ఉత్కంఠ కొనసాగుతోంది. క్యాబినెట్ విస్తరణ అనంతరం పెండింగ్‌లో ఉన్న అన్ని నామినేటెడ్ పోస్టులకు నియామకాలు చేపడతామని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రకటించినప్పటికీ, క్యాబినెట్ విస్తరణ రోజురోజుకూ జాప్యమవుతోంది. దీంతో నామినేటెడ్ పదవులు కోరుతున్న ఆశావహుల్లో ఆందోళన మొదలైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ ఏప్రిల్ మొదటివారంలోనే ఉంటుందని భావించినా, రకరకాల కారణాలతో అది వాయిదా పడింది. దీంతో క్యాబినెట్ విస్తరణతో సంబంధం లేకుండా నామినేటెడ్ పదవుల పంపకాలు చేపట్టాలని ఆశావహులు మంత్రులు, ముఖ్యనేతలపై ఒత్తి డి తెస్తున్నారు. పదేళ్లపాటు అధికారంలో లేకున్నా పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, గడచిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి చెమటోడ్చిన నాయకులతోపాటు, అదిష్టానం సూచనలమేరకు ఎమ్మెల్యే టిక్కెట్లకు పోటీ నుంచి తప్పుకున్న వారు ఇకనైనా తమకు ఇచ్చిన హామీ మేరకు తక్షణం నామినేటెడ్ పదవులు ఇవ్వాలని గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్నారు.

గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్న ఆశావహులు

క్యాబినెట్ విస్తరణ, తత్సమాన పదవుల నియామకాలు పూర్తయిన వెంటనే నామినేటెడ్ పదవులూ భర్తీ చేస్తామని అంతా భావిస్తున్న తరుణంలో విస్తరణ వాయిదా పడింది. దీంతో తమ సంగతేంటని, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నేతలు గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, డాక్టర్ కుడుదుల నగేశ్‌లు వారికి కీలకమైన పదవి వస్తుందనే విశ్వాసంలో ఉన్నారు. కీలకమైన యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, బోర్డు సభ్యుల పదవులతో పాటు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు, జిల్లా స్థాయిల్లో ఉండే గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, మహిళా ఆర్గనైజర్ పదవులు, దేవాలయాల కమిటీల చైర్మన్ పదవులు, అర్బన్‌డెవలప్‌మెంట్ అథార్టీల చైర్మన్ పదవులు, మార్కెట్ కమిటీ చైర్మన్ల వంటి పదవులను ఆశించే నాయకులంతా పదవులిప్పించాలని మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. ● బీసీ కోటాలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత కార్పొరేషన్ పదవిని ఆశిస్తున్నారు. ● నల్లగొండ నియోజకవర్గంలో పార్టీని ముందుండి నడిపి, క్యాడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన గుమ్మల మోహన్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి పదవి వస్తుందని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహిరంగంగా ప్రకటించినా, ఇప్పటివరకు ఆయనకు పదవి ఖరారు కాలేదు. ● నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన ముఖ్య అనుచరుడు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డికి సైతం రాష్ట్ర కార్పొరేషన్లలో కీలక పదవి ఖాయమైందని చెబుతున్నా నియామకం జరగకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. ● నకిరేకల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిక్కెట్ ఆశించి భంగపడ్డ పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యకు త్వరలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖాయమని చెబుతున్నారు. మరోవైపు దైద రవీందర్, అన్నెపర్తి జ్ఞానసుందర్ కూడా కార్పొరేషన్ పదవులకోసం ప్రయత్నాలు చేస్తున్నారు. యాదాద్రి జిల్లా పార్టీ

మిగతా 7వ పేజీలో...

నామినేటెడ్‌లో ఛాన్స్ దక్కింది కొందరికే

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీ పదవులు దక్కాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందే తొలిదశలో జరిగిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లో ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేష్‌రెడ్డి (సూర్యాపేట), మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి (ఆలేరు), రాష్ట్ర దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య (హుజూర్‌నగర్) నియమితులయ్యారు. రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి నియమితులయ్యారు.

సీసీఎస్ బిల్లును ఉపసంహరించుకోవాలి

టాప్రా జిల్లా అధ్యక్షుడు జగదీష్ చంద్ర



పోస్టల్ అధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సీసీఎస్ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్‌చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పెన్షనర్ల జేఏసీ పోరాట కార్యక్రమంలో భాగంగా టాప్రా ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోస్టల్ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెన్షన్ భిక్ష కాదని అది హక్కు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ రూల్స్‌కు అతి ప్రమాదకరమైన సీసీఎస్ బిల్లును ప్రవేశపెట్టి లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదింపచేయడం విచారకరమన్నారు.

ఈ బిల్లు ద్వారా 50లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65లక్షల మంది పెన్షనర్లకు నష్టమన్నారు. వీరితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర రంగాల్లోని ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇది ఉరితాడు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా పెన్షన్లను ఉద్యోగ విరమణ తేదీ ఆధారంగా నిర్ణయించడానికి కేంద్రం తెచ్చిన బిల్లు అధికారం కల్పిస్తోందన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణాల పరిపూర్ణాచారి మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా సర్వీస్ చేసిన ఓ ప్రభుత్వరంగ కార్మికుడికి రూ.3వేల పెన్షన్ కూడా రావడం లేదని, కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టాప్రా జిల్లా గౌరవ అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, నాయకులు ఎండి.అబ్దుల్‌ఖాదర్, గుండాల భిక్షమయ్య, చంద్రారెడ్డి, రామచంద్రం, జయ రామయ్య, నరసింహ, ప్రసాద్, కేసాని భిక్షంరెడ్డి, సిలువేరు మారయ్య, జి.భిక్షమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సన్నాలను సాగుచేయాలి

» కలెక్టర్ ఇలా త్రిపాఠి » త్వరలో నిత్యావసర సరుకుల పంపిణీ: ఎమ్మెల్యే బాలునాయక్



లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్, ఏఎస్పీ మౌనిక

డిండి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైతులు సన్న ధాన్యం సాగుకు ముందుకు రావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. గురువారం డిండి మండల కేంద్రంలోని రేషన్ దుకాణం-2 వద్ద ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు సన్నాలను సాగుచేసి ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.మండలంలో 10ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. రేషన్‌కార్డుల కోసం మండలంలో 1,426 మంది దరఖాస్తు చేసుకున్నారని, పారదర్శకంగా విచారణ నిర్వహించి కొత్తకార్డులు జారీ చేస్తామన్నారు. దేవరకొండలో వేబ్రిడ్జి ఏర్పాటు చేస్తామన్నారు.

రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు

రేషన్ దుకాణాల ద్వారా త్వరలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలపై ఆర్థిక భారం తగ్గించి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా జారీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం 30లక్షల నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పిస్తోందన్నారు. శాశ్వత సాగునీటి కోసం డిండి ఎత్తిపోతలకు రూ.1,800 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచిందని, మూడేళ్లలో పనులు పూర్తిచేసి సాగునీరు అందిస్తామన్నారు. డిండిలో అంగడి బజార్‌లో రూ.3.70కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని, బీసీ కాలనీలో సీసీరోడ్లు పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. పూరిగుడిసెలు, రేకుల ఇళ్లు ఉన్నవారికి ఇందిరమ్మ ఇంటి పథకంలో తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంపీడీవో వెంకన్న, డీఎస్‌వో హరీష్, డీటీసీఎస్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, ఎన్.రాజేష్‌రెడ్డి, గుర్రం రాములు, గోవర్ధన్‌రావు, యాదగిరిరావు, బుచ్చిరెడ్డి, పోలం లక్ష్మణ్, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, గడ్డమీది సాయి, బూషిపాక వెంకటయ్య, నూకం వెంకటేష్, మేకల కాశయ్య, ఎండి.మైనుద్దీన్, పోల వెంకటేష్, గంగిడి ఆనంద్‌రెడ్డి, పేట కొండల్, మహమ్మద్ అలీ, సాలయ్య, బద్య, పోషాలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తోందని తెలిపారు. రైతులు ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏవో శివరాంకుమార్, ఏఈవోలు శిరీష, వేణుగోపాల్, పార్వతీ, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూలులో చండూరుకు ప్రథమ స్థానం

చండూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఆర్థిక సంవత్సరానికి (2024-25) ఇంటి పన్ను వసూళ్లలో చండూరు మునిసిపాలిటీ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది.చండూరు మునిసిపాలిటీలో 3,635 ఆస్తులు ఉన్నాయి. 2024-25 సంవత్సరానికి ఆస్తి పన్ను డిమాండ్ రూ.67లక్షలు కాగా, మార్చి 31 నాటికి రూ.57లక్షలు వసూలైంది. జిల్లాలో చండూరు 85.07శాతం వసూలుతో ప్రథమ స్థానంలో నిలవగా, దేవరకొండ మునిసిపాలిటీ 74.30శాతంతో రెండో స్థానంలో, చిట్యాల మునిసిపాలిటీ 73.18శాతంతో మూడో స్థానంలో నిలిచాయి. చండూరు ప్రథమ స్థానంలో నిలవడంతో గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి మునిసిపల్ కమిషనర్ మున్వర్ అలీకి అప్రిసియేషన్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మునిసిపల్ కమిషనర్ మున్వర్ అలీ మాట్లాడుతూ, ప్రజలు చెల్లించే ఇంటి పన్ను పట్టణ అభివృద్ధికి తోడ్పడుతుందని ఇంటింటికీ తిరిగి సిబ్బంది అవగాహన కల్పించారన్నారు. పన్ను బకాయిల వడ్డీపై ప్రభుత్వం 90శాతం రాయితీ కల్పించడంతో బకాయిదారులు సద్వినియోగం చేసుకునేలా కృషి చేశామన్నారు.



మునిసిపల్ కమిషనర్ మున్వర్ అలీ

ఉమ్మడి జిల్లాలో ఆస్తి పన్ను వసూలు వివరాలు 7లో..

ఆంధ్రజ్యోతి *** మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దఅడిశర్లపల్లి,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 8712670227 కు సంప్రదించాలని కోరారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

దేవరకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి గురువారం నిర్వహించారు. అంజయ్య కాలనీలోని శివాజీ మహారాజ్ విగ్రహానికి శివాజీ యువదళ్ వ్యవస్థాపకులు ముప్పిపల్లి హరికృష్ణ, పగిడిమర్రి సతీష్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నీల రవి, శ్యాం, శ్రీనివాస్, గణేష్, రాము, శ్రీను, అజయ్, శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

● యూసుఫ్, కమిషనర్, మిర్యాలగూడ



ఇంటర్వ్యూ Interview

గ్రేడ్-1 మునిసిపాలిటీగా ఉన్న మిర్యాలగూడను స్పెషల్ గ్రేడ్ పురపాలికగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. అయితే మునిసిపల్ అభివృద్ధికి ఆస్తి, నీటి పన్నుతో పాటు ట్రేడ్ లైసెన్స్ ఎల్‌ఆర్‌ఎస్ రుసుము, ఓపెన్ స్పేస్ చార్జీలు సకాలంలో చెల్లించాలని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కోరారు. (మిర్యాలగూడ టౌన్ - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి : పట్టణాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?

కమిషనర్ : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేవిధంగా పార్కుల ఏర్పాటు, పచ్చదనం పెంపు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : పట్టణంలో తాగు నీటి కొరత ఉందా..?

కమిషనర్ : తాగునీటి కొరత పెద్దగా లేదు. జనాభా పెరుగుతుండడంతో భవిష్యత్ అవసరాలకు గాను రూ. 93.40 కోట్లతో అమృత్-2 ప్రాజెక్టు నిర్మిస్తున్నాం. పూర్తయితే నీటి కొరతన్నదే ఉండదు.

ఆంధ్రజ్యోతి : మురుగునీటి పారుదల ఎలా ఉంది..?

కమిషనర్ : మురుగునీటి పారుదలన్నది చిన్న విషయమై కానీ పెద్ద సమస్య. ఎప్పటికప్పుడు కాల్వలను శుభ్రం చేయిస్తున్నా. అక్కడక్కడా నీరు పారడం లేదు. అందుకు కారణం వ్యర్థాలను కాల్వల్లో వేయడమే. మా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నప్పటికీ వ్యర్థాలను రోడ్ల వెంట, మురుగు కాల్వలలో, నాలాలలో వేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : అంతర్గత డ్రైనేజీ పనితీరెలా ఉంది..?

కమిషనర్ : అమృత్, పబ్లిక్ హెల్త్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పునఃప్రారంభించాం. రూ. 173 కోట్ల నిధులతో చేపట్టిన పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

ఆంధ్రజ్యోతి : డంపింగ్ యార్డు నిర్వహణ ఎలా ఉంది..?

కమిషనర్ : పట్టణంలో రోజు 50 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఆరున్నర ఎకరాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు సరిపోవడం లేదు. యార్డు ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు లేఖ రాశాం. అప్పటి వరకు వ్యర్థాలను ధ్వంసం చేసేందుకు బయో మైనింగ్ విధానం అమలు చేయనున్నాం.

ఆంధ్రజ్యోతి : సిబ్బంది కొరత ఉందా..?

కమిషనర్ : సిబ్బంది కొరత లేదు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన 28 మంది వార్డు ఆఫీసర్లతో కార్యాలయం కళకళలాడుతోంది. పౌర సేవలందించడంలో ఎటువంటి జాప్యాలు, లోపాలు తలెత్తకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ సజావుగా సాగుతోందా..?

కమిషనర్ : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ప్రభుత్వం 25శాతం ఫీజు రాయితీ కల్పించింది. మొత్తం 14,320 దరఖాస్తులు రాగా అందులో 1,418 దరఖాస్తుల ఫీజు చెల్లించారు. 619 మందికి ప్రొసీడింగ్స్ అందజేశాం. 8,064 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా 33 రిజెక్ట్ చేశాం. రూ. 9.03 కోట్ల (మార్చి 31 నాటికి) ఆదాయం సమకూరింది.

ఆంధ్రజ్యోతి : ఆస్తి పన్ను వసూలు ఎలా ఉంది ..?

కమిషనర్ : ప్రస్తుత, పాత బకాయిలు కలిపి ఈ ఏడాది రూ. 25.63 కోట్ల డిమాండ్ ఉంది. ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ప్రభుత్వం 5శాతం రాయితీ అందస్తోంది. ఈ పథకం ముగిసే ఏప్రిల్ 30 నాటికి 25శాతం పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

'అంబ భవాని' పనులు పునః ప్రారంభం

● ఏడాది క్రితం నిలిచిపోయిన పనులు ● వేగంగా పూర్తి చేయాలని స్థానికుల వేడుకోలు

దేవరకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లోని గుట్టలపై ఉన్న గ్రామాలకు లిఫ్టుల ద్వారా సాగునీరు అందించాలనే లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2021లో పలు ఎత్తిపోతల పథకాల పనులకు శంకుస్థాపన చేసింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ముంపు బాధితులు చందంపేట, నేరేడుగొమ్ము, పీఏపల్లి మండలాల్లో గుట్టలపై ఉన్న గ్రామాల్లో పునరావాసం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వర్షాధార పంటలు వేసుకొని జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుట్టలపై ఉన్న గ్రామాల రైతులకు లిఫ్టల ద్వారా సాగునీరు అందించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.565 కోట్లతో కంబాలపల్లి, పొగిళ్ల, అంబభవాని, పెద్దమునిగల్, ఏకేబీఆర్, పెద్దగట్టు ఎత్తిపోతల పథకాలకు పనులు ప్రారంభించింది. కానీ నిధుల కొరత, అటవీశాఖ అనుమతులు రాకపోవడం, వర్షాలు కురవడంతో లిఫ్టల పనులు నిలిచిపోయాయి.

20 వేల ఎకరాలకు సాగునీరు

ఏడాది తరువాత నేరేడుగొమ్ము మండలం అంబ భవాని ఎత్తిపోతల పథకం పనులు పునః ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పంపుహౌజ్ నిర్మాణం, పైప్ లైన్ల పనులు కొనసాగుతున్నాయి. ఎత్తిపోతల పథకం పూర్తయితే నేరేడుగొమ్ము మండలంలోని 12 గ్రామాలకు 20వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. నిధులు కేటాయించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



కొనసాగుతున్న అంబ భవాని ఎత్తిపోతల పథకం పనులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించడంతో మళ్లీ పనులు పునః ప్రారంభమయ్యాయి. దీంతో ఏకేబీఆర్, అంబ భవాని లిఫ్ట్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. పీఏపల్లి మండలం ఏకేబీఆర్ లిఫ్ట్ పనులు 45 శాతానికిపైగా పూర్తికాగా, నేరేడుగొమ్ము మండలం అంబ భవాని ఎత్తిపోతల పథకం పనులు 35 శాతం పూర్తయ్యాయి. కంబాలపల్లి ఎత్తిపోతల పనులు 25శాతం పూర్తయ్యాయి. పెద్దగట్టు, పొగిళ్లఎత్తిపోతల పనులకు అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో ప్రారంభంకాలేదు.

పనులు జరుగుతున్నాయి

అంబభవాని ఎత్తిపోతల పథకం పనులు కొనసాగుతున్నాయి. గతంలో కురిసిన వర్షాలు, సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయా యి. ఇటీవల తిరిగి పనులు పున ప్రారంభమయ్యాయి. 30 శాతం వరకు పనులు జరిగాయి.

- ప్రభాకర్, అంబ భవాని ఎత్తిపోతల పథకం డీఈ

నేడు బంగారు మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

దేవరకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మద్దెలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శ్రీబంగారు గండి మైసమ్మతల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శుక్ర వారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు నల్లగాసు జాన్‌యాదవ్, విజయ్‌కుమార్, ప్రధాన అర్చకుడు గంప ప్రవీణ్ కుమార్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్ఠాపనమహోత్సవానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘు వీర్ రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మె ల్సీ నెల్లికంటి సత్యం హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

నిడమనూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని మోటివేషన్ స్పీకర్ నూనె సుదర్శన్ అన్నారు. మండలంలోని తుమ్మడం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. డ్రగ్స్ చాలా ప్రమాదకరమైనవని, వాటిని వినియోగించి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు.

పేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే



హాలియాలో మాట్లాడుతున్న మాజీ సీఎల్‌పీ నేత జానారెడ్డి పక్కన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మాజీ సీఎల్‌పీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుముల కేవీ కాలనీకి చెందిన 1,034 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల హక్కుపత్రాలను వారు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే అనేక ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని, పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో పేదలకు ఇళ్లు ఇవ్వడంలో విఫలమైందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రజాపాలనలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు త్వరలో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇక నుంచి ఇందిరమ్మ ఇళ్ల హక్కు పత్రాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

సీతారామాంజనేయస్వామి ఆలయంలో పూజలు

అనుముల సీతారామాంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ సీఎల్‌పీ నేత కుందూరు జానారెడ్డి సొంత ఊరు అనుముల కావడంతో వారు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల యోగ క్షేమాలు తెలుసు కున్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రఘు, కాకునూరి నారాయణ గౌడ్, చింతల చంద్రారెడ్డి, యడవల్లి నరేందర్‌రెడ్డి, గౌని రాజా రమేష్‌యాదవ్, చంద్ర శేఖర్‌రెడ్డి, పిల్లి ఆంజనేయులు, జూపల్లి శ్రీనివాస్, చెరుకూరి సుబ్రహ్మణ్యం, జూపల్లి శ్రీనివాస్, పిల్లి ఆంజనేయులు, చెరుకూరి కిరణ్‌కుమార్, కుందూరు శ్యాం, ప్రసాద్‌నాయక్, నర్సిరెడ్డి, అశోక్‌రెడ్డి, మిట్టపల్లి వాసులు, వెంపటి శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

యాసంగిలో ఎకరం పంట కూడా ఎండిపోవద్దు



డిండిలో నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఈ యాసంగిలో సాగుచేసిన పంటలో ఎకరం కూడ ఎండిపోకుండ చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచించారు. డిండి మండల కేంద్రంలో గురువారం ఆయన నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్ననీరు ఎన్ని రోజులకు సరిపడుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పుడు ప్రాజెక్టులో ఉన్న 22 అడుగుల నీటిని 45 రోజులకు సరిపడే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. మే 15వరకు నీటి విడుదల కొనసాగే విధంగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కాల్వల వెంట లస్కర్‌కు బాధ్యతలు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. యాసంగి పంట పూర్తయ్యే వరకు ప్రాజె క్టుకు మరో ఏఈని నియమించి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని ఎమ్మెల్యే ఈఈని ఆదేశించారు. దెబ్బతిన్న ప్రాజెక్టు రివిట్‌మెంట్, చెట్ల తొలగింపు, ఘాట్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గాజుబేడ, అంబభవాని, రాములోనిబండ లిఫ్టలపై రివ్యూ నిర్వహించారు. సమావేశంలో ఈఈ యలమంద, డీఈ శ్రీనివాస్, ప్రభాకర్, మనోహర్, కృష్ణ, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్, వెంకటయ్య పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

చింతపల్లి : మండలంలోని పోలేపల్లిరాంనగర్ మైసమ్మ ఆలయంలో ధ్వజప్రతిష్ఠాపనోత్సవంలో ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలూసంజీవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగ భూషణ్, మాజీ ఎం పీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధగోని కృష్ణగౌడ్, మాజీ ఎంపీటీసీ మునుకుంట్ల శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచి కొప్పుల జంగయ్యగౌడ్, దొంతగొని శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

● మడమడక బొడ్రాయి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మడమడకలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యో తి): దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని మడమడక గ్రామ బొడ్రాయి వార్షికోత్సవంలో గు రువారం ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్ర తి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆయన వెంట చింతపల్లి సుభాష్, బొడ్డుపల్లి కృష్ణ, తులసీరాం, ఆంజనేయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

● చింతపల్లి :మండలంలోని పోలేపల్లిరాంనగర్ మైసమ్మ ఆలయం లో ధ్వజ ప్రతిష్ఠాపనోత్సవంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గం టల విద్యుత్ సరఫరాలో కాంగ్రెస్ ప్ర భుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు కేతవత్ బిల్యానాయక్, కంకణాల వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధగోని కృష్ణ గౌడ్, దొంతగోని శేఖర్‌గౌడ్, ఉడుత అక్రంయాదవ్, ఈరటి శేఖర్, ముద్దం జోగయ్య, బాదేపల్లి నిరంజన్ గౌడ్, పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసు నమోదు

నాగార్జునసాగర్,ఏప్రెల్3(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం కిడ్నాప్ కేసు నమోదైంది. ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్ల మండలం పసివేముల గ్రామానికి చెందిన హరిశ్చంద్ర గ్రామంలో గతంలో జరిగిన గొడవల వల్ల నల్లగొండ జిల్లా కనగల్‌కు వచ్చి జీవిస్తున్నాడు. పింఛన్ కోసంసాగర్‌కు రావడంతో సమాచారం తెలుసుకున్న ప్రత్యర్థులు అతడిని కిడ్నాప్ చేశారు. దీంతో హరిశ్చంద్ర భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నలుగురు అనుమానితులను పసివేముల గ్రామం నుంచి సాగర్‌కు తీసుకవచ్చి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు గురువారం రాత్రి సాగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారణ చేపట్టారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్ట్

గుర్రంపోడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవపడి ఆమె గొంతుకోసి హతమార్చిన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు కొండమల్లేపల్లి సీఐ రాజు తెలిపారు. గుర్రంపోడు గ్రామానికి చెందిన దుప్పెల్లి ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. ఆటో నడిపే క్రమంలో కొప్పోలులో తమ బంధువుల ఇంటివద్ద ఉన్న అరుణను కొన్నేళ్ల క్రితం ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లు సంసారం సాఫీగా సాగింది. ఈ క్రమంలో మద్యం బానిసై ఆటో ఈఎంఐలు కట్టలేని పరిస్థితికి చేరుకున్నాడు. విషయం గ్రహించిన భార్య అరుణ తెరాటిగూడెంలో బంధువుల సహకారంతో కిరాణ దుకాణం నిర్వహిస్తూ అనంతరం మిర్చి బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కిరణ్ మద్యానికి బానిసై తరచూ గొడవ పడి బంధువుల ఇళ్లకు వెళ్లిన ప్రతిసారి పది రోజులు ఉండి తిరిగి గ్రామానికి వస్తుండేవాడు. ఇదే క్రమంలో పది రోజుల పాటు కనిపించకుండా వెళ్లి మార్చి 31న తిరిగి ఇంటికి వచ్చాడు. భార్య దుప్పెలి అరుణతో మద్యానికి డబ్బులు ఇవ్వాలని గొడవ పడ్డాడు. ఇలా చేస్తే కుటుంబ పోషణ ఎలా అని కిరణ్‌ను ప్రశ్నించడంతో పక్కనే ఉల్లిగడ్డలు కోసే కత్తితో మెడపై రెండు చోట్ల కోశాడు. దీంతో అరుణ కేకలు లేస్తూ రోడ్డుపైకి వచ్చి అక్కడికక్కడే మృతి చెందింది. హత్య జరిగిన రోజు నుంచి కిరణ్ పరారీలో ఉన్నాడు. గుర్రంపోడు పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి నేరస్తుడి కోసం వెతుకుతుండగా గుర్రంపోడు వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, సెల్‌ఫోన్, దుస్తులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చొరవ చూపిన సీఐ రాజు, ఎస్‌ఐ మధు, కానిస్టేబుళ్లు నర్సింహా, సత్యనారాయణ, కిరణ్, సైదులును దేవరకొండ ఏఎస్పీ మౌనిక అభినందించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాడ్గులపల్లి : ఇందుగుల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్

నిడమనూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఊట్కూరులో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం రుణమాఫీ, రైతుభరోసా, సన్నధాన్యానికి బోనస్ అమలు చేసిందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. ఊట్కూరు గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనారాయణ, నాయకులు అంకతి సత్యం, నర్సింగు విజయ్‌కుమార్, మేరెడ్డి వెంకట్‌రాహుల్, నందికొండ మట్టారెడ్డి, వల్లభ్‌రెడ్డి, యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, నర్సింగు కృష్ణయ్య, శివమారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కోటయ్య, పాపమ్మ, సీసీ యాదయ్య పాల్గొన్నారు.

● మండలంలోని మారుపాకలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చిత్రం జీవన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో గోపు రమణారెడ్డి, కోమటి సోమయ్య, ఆంజనేయులు, బొడ్డు వెంకటేశ్వర్లు, సీసీలు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి : మండలంలోని ఇందుగుల గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరు రమే ష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, గడ్డం పురుషోత్తంరెడ్డి, యాదయ్య ఉన్నారు.

పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం



వేములపల్లి : రావులపెంటలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

వేములపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీనవర్గాలకు కడుపు నింపేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని రావులపెంట గ్రామంలో సన్నబియ్యం పంపిణీని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో పేదలకు దొడ్డు బియ్యం ఇవ్వడంతో సరిగా తినక అర్ధాకలితో అలమ టించారన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రభు త్వం పై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని ఆయన అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్ప లత, డీటీ కోటేశ్వరి, ఆర్‌ఐ మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్, కాంగ్రెస్ మండ లాధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, పుట్టల కృపయ్య, మర్రి ఎలియాస్, బీరవెల్లి సతీష్‌రెడ్డి, శీలం శ్రీను, వెంకట్‌రెడ్డి, సందీప్, నగేష్, డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, సుధాకర్‌రెడ్డి, పాండురంగయ్య పాల్గొన్నారు.

● దేవరకొండ : పేదలకు సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ 11వ వార్డులో రేషన్ దుకాణంలో గురువారం సన్నబియ్యాన్ని పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డీటీ సీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, వల్లా నర్సింహారెడ్డి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎంపీడీవో డానియెల్ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలను వెనక్కి తీసుకురావాలి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

త్రిపురారం ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని కేటాయిం చిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కళాశాలను వెనక్కి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కంపసాగర్‌లోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను గురువారం ఆయన సందర్శించి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంపసాగర్‌కు బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని కోరగా అప్పటి సీఎం కేసీఆర్ దాన్ని మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. కానీ ఇటీవల నిర్వహించిన హుజూర్‌నగర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డిని బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కళాశాలను తమ నియోజకవ ర్గాన్ని కేటాయించాలని కోరగా దాన్ని మళ్లీ సీఎం హుజూర్‌నగర్‌కు మంజూరు చేస్తున్న ట్లు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. తక్షణమే వ్యవసాయ డిగ్రీ కళా శాలను సాగర్ నియోజకవర్గాన్ని తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడానికి కూడా వెనుకాడబోమని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి వెంకటాచారి, రైతు బంధు మాజీ సభ్యుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కామెర్ల జానయ్య, భైరం కృష్ణ, నగిరి శ్రీను, ఎల్లయ్య, వెంకన్న యాదవ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల జోలికి వస్తే ఉద్యమం

మిర్యాలగూడరూరల్,ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హైదరా బాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఉద్యమం తప్పదని ఎస్‌ఎఫ్‌ఐ మం డల కార్యదర్శి మంద వంశీకృష్ణ అన్నారు. ఆ సంఘం పిలుపు మేరకు గురువారం చలో సచివాలయం వెళ్తున్న వంశీకృష్ణను రూరల్ పోలీసులు ఇంటివద్ద అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమి వేలాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

దేవరకొండ : ప్రజాపాలనలో విద్యార్థి నేతలను ముందస్తుగా అరెస్టులు చేయడం సరైన విధానం కాదని ఏబీవీపీ నల్లగొండ జిల్లా హస్టల్స్ కన్వీనర్ యలమల గోపిచంద్ అన్నారు. గురువారం హైదరాబాద్ సెంట్రల్ యునివర్సిటీకి తరలివెళ్త న్న ఏబీవీపీ విద్యార్థి నేతలను దేవరకొండ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో పగిళ్ల విక్రమ్, మల్లేష్‌లు ఉన్నారు.

● కొండమల్లేపల్లి : చలో సెక్రటేరియట్ పిలుపునిచ్చిన నేపథ్యంలో కొండమల్లేపల్లి పోలీసులు స్థానిక బీజేవైఎం నాయకులను గురువారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో భూతరాజు భరత్‌కుమార్, బోడ కృష్ణ, నెల్లికంటి గోపి, అఖిల్ ఉన్నారు.

మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

కొండమల్లేపల్లి, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం పట్ల బీజేపీ శ్రేణులు గురువారం స్థానిక కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద భారత ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వురు మాట్లాడుతూ ఈ బిల్లు ఆమోదం పొంద డం తో పేదముస్లింలకు న్యాయం జరుగుతుందని అన్నా రు. కార్యక్రమంలో చెనగోని శివగౌడ్, బాబులాల్, జంగిటి మల్లేష్, కుంభం యాదగిరిగౌడ్, ఎండీ జహీర్, నెల్లికంటి గోపి, నగేష్ పాల్గొన్నారు.



మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు